


నేటి దినపత్రిక

# సూర్య

ఉత్తరాంధ్ర

శుక్రవారం 17-1-2025 పేజీలు 6

www.suryaa.com

విశాఖ - అనకాపల్లి - అల్లూరి - మన్యం

విజయనగరం శ్రీకాకుళం


## ఒరిస్సా నుంచి అక్రమ కలప రవాణా..?

### కలప స్మగ్లర్ల చేతిలో అటవీశాఖ..?



పార్వతీపురం రూరల్, జనవరి 16, మేజర్‌న్యూస్

ఒరిస్సా రాష్ట్రం నుంచి అక్రమంగా విలువైన టేకు జాతి కలప యదేచ్ఛగా రాష్ట్రంలోకి తరలించి కోస్తున్నారు. అయితే ఈ కలప స్మగ్లింగ్ వ్యవహారమంతా అటవీశాఖ అధికారుల కను సన్నటిలోనే జరుగుతుందని పలువురు బాహాటంగా ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారానికి కొందరు అటవీ శాఖ సిబ్బంది సూత్రధారులుగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు సర్వత్ర వినిపిస్తున్నాయి. ఏ రోజు రాత్రి ఒరిస్సా నుంచి కలపను రాష్ట్రంలోకి దిగుమతి చేసుకోవాలన్న దిశా నిర్దేశం కూడా అటవీశాఖ సిబ్బంది కలప స్మగ్లర్ల దిశా నిర్దేశం ఇస్తున్నారని తెలుస్తుంది. దీంతో ఈ కలప స్మగ్లింగ్ వ్యవహారం స్మగ్లర్లకు మూడు పువ్వులు ..ఆరుకాయలుగా మారింది .ఒరిస్సా నుంచి వారానికి రెండు మూడు సార్లు కస్ప వలస మీదుగా గోచక్క సరిహద్దు గ్రామాల్లోకి ట్రాక్టర్ల సహాయంతో తీసుకువచ్చి ఎవరి కంటపడకుండా డంప్ ఈ మార్గంలోనే కాకుండా ఊరిస్తా నుంచి అలమండ బ్లాక్ పరిధిలో గల అనేక విలువైన వృక్షజాతిను అక్కడి సమీప గిరిజనుల సహకారంతో నరికి ట్రాక్టర్లతో పట్టణానికి తరలిస్తున్నారు. ఈ విధంగా తరలించిన కలపను సమయం చూసుకొని సమీప తరలి డిపోలకు తీసుకొచ్చి చెక్కలుగా దొంగలుగా కోత కోసి లక్షలు సంపాదిస్తున్నారు. ఈ చీకటి వ్యవహారానికి సహకరిస్తున్న అటవీశాఖకు మామూలు ఇచ్చి విలువైన వృక్షశాతిని గొడ్డలివేటితో నేలకురుస్తున్నారన్న విమర్శలు కూడా సర్వత్ర వినిపిస్తున్నాయి. ఇటీవల మండలం లోని అడ్డాకు శీల కర్రల మిల్లులో (సామిలో) విలువైన టేపు జాతి భారీ వృక్షాలు దర్శనం ఇవ్వడమే ఎందుకు నిదర్శనంగా చెప్పుకోవచ్చు. వాస్తవానికి అటవీశాఖ అధికారుల లెక్కల్లో కూడా లేనివిధంగా భారీ టేకు చెట్లు ఆ సామ్యాల్లో కోతకు వచ్చాయంటే సందేహం అక్కర్లేదు. అదేవిధంగా లచ్చిరాజుపేట కారణమెల్లిలో నిత్యం ఇదే తతంగం జరుగుతున్నట్లు సమాచారం. ఈ అక్రమ కలప స్మగ్లెన్నో నివారించేందుకు ఒరిస్సా రాష్ట్ర అటవీశాఖ అధికారులు తరలిపట్టు కుంటున్నారు. విలువైన వృక్షజాతి తరలి పోతున్న అది మిగతా 2లో



## విశాఖ ఉక్కుకు రూ.11,300 కోట్ల భారీ ప్యాకేజీ

### ప్రైవేటీకరణ అంటూ జరుగుతున్న ప్రచారానికి తెర - ప్రధాని మోదీ అధ్యక్షతన ఢిల్లీలో కేంద్ర క్యాబినెట్‌లో నిర్ణయం -ప్యాకేజీపై నేడు అధికారిక ప్రకటన వెలువడే అవకాశం




విశాఖపట్నం, జనవరి 16, మేజర్‌న్యూస్ :

విశాఖ ఉక్కు పరిశ్రమకు కేంద్రం చేయూత అందించనుంది. భారీ ప్యాకేజీతో ప్లాంట్‌ను అప్పుల నుంచి గట్టెక్కించేందుకు కీలక అడుగులు వేస్తోంది. సుధీర్ఘ చరిత్ర కలిగిన విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరణ చేస్తారంటూ జరుగుతున్న ప్రచారానికి ఎట్టకేలకు కేంద్రం చెక్ పెట్టింది. ఈ మేరకు గురువారం విశాఖ స్టీల్ ప్లాంట్ కు కేంద్ర ప్రభుత్వం శుభవార్తను మోసుకొచ్చింది. నష్టాల్లో ఉన్న ఉక్కు పరిశ్రమను మళ్లీ నిలబెట్టేందుకు రూ.11,300 కోట్లతో భారీ ఉద్దీపన ప్యాకేజీకి ఆమోదం తెలిపింది. గురువారం ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర క్యాబినెట్ ఈ మేరకు కీలక నిర్ణయం తీసుకుంది. ఉక్కు పరిశ్రమకు సంబంధించి ఆపరేషనల్ పేమెంట్స్ మిగతా 2లో

## జీడి పప్పు ప్రాసెసింగ్ కు సిద్ధం చేయాలి

### పార్వతీపురం జిల్లా కలెక్టర్ ఏ శ్యామ్ ప్రసాద్



పార్వతీపురం, జనవరి 16, మేజర్‌న్యూస్

జిల్లాలో జీడి పప్పు ప్రాసెసింగ్‌కు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ఏ శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు గురువారం సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పార్వతీపురం, వీరఘట్టం లలో గిడ్డంగులు ఉన్నాయని, వాటిని వినియోగించుకోవచ్చని సూచించారు. సాలూరు, గుమ్మలక్ష్మీ పురం, కురుపాంలలో ప్రాసెసింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆయన అన్నారు. అందుకు అవసరమగు యంత్ర పరికరాలు ఏర్పాటు చేయాలని ఆయన చెప్పారు. ప్రాసెసింగ్ చేయుటకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారు. గోనె సంచులు కూడా ఏర్పాటు చేయాలని ఆయన స్పష్టం చేశారు. ప్రాసెసింగ్ కేంద్రాల వద్ద అవసరమగు పరికరాలు, సిబ్బంది, సిబ్బందికి అవసరమైన శిక్షణ ఇప్పించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ప్రాసెసింగ్ కేంద్రాలకు అవసరమైన ప్రతి అంశాన్ని పరిగణలోకి తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. సీతంపేట ప్రాంతంలో ఇప్పటికే ప్రాసెసింగ్ జరుగుతుందని, వాటిని ఆధారంగా లైసెన్సు తదితర అంశాలను కూడా పరిశీలించాలని ఆయన చెప్పారు. డి.ఆర్.డి.ఏ ప్రాజెక్టు డైరెక్టర్ వై సత్యం నాయుడు మాట్లాడుతూ గుమ్మలక్ష్మీ పురం, సాలూరు, మక్కువలలో రెండు చొప్పున ప్రాథమిక ప్రాసెసింగ్ సెంటర్లు ప్రస్తుతానికి ఉన్నాయని వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పార్వతీపురం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి మరియు పార్వతీపురం సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ తదితరులు పాల్గొన్నారు.

## రహదారి నిబంధనలను పాటించాలి

### విజయనగరం జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్

విజయనగరం బ్యూరో, జనవరి 16, మేజర్‌న్యూస్

రహదారిపై ప్రయాణించేటప్పుడు ప్రతీఒక్కరూ నిబంధనలను పాటించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోరారు. అజాగ్రత్తగా వాహనాన్ని నడపడం వల్లే 90 శాతం ప్రమాదాలు జరుగుతున్నాయని , నిబంధనలను పాటించడం ద్వారా వీటిని నివారించవచ్చునని సూచించారు. వాహనాలను నడిపేటప్పుడు నిర్లక్ష్యాన్ని విడనాడాలన్నారు. తమ కుటుంబాలను, పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొనైనా, భద్రతా నియమాలను పాటిస్తూ జాగ్రత్తగా వాహనాలను నడపాలని సూచించారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలను కలెక్టర్ తమ ఛాంబర్‌లో గురువారం ప్రారంభించారు. దీనికి సంబంధించిన గోడపత్రికలను ఆవిష్కరించారు. నేటినుంచి ఫిబ్రవరి 15 వరకు జరిగే మాసోత్సవాల్లో భాగంగా రహదారి భద్రతా నియమాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివిధ వర్గాల ప్రజలకు, వాహన డ్రైవర్లకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ మణికుమార్, ఆర్‌టిఓ విమల, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.




## నేటి నుంచి జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు

### మాసోత్సవాలు-2025 పోస్టర్, కరపత్రాలను విడుదల చేసిన జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి



అనకాపల్లి ప్రతినిధి, జనవరి 16, మేజర్‌న్యూస్

జిల్లాలో జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలను పకడ్బందీగా, చిత్తశుద్ధితో నిర్వహించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం. జాహ్నవి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలపై రవాణా, పోలీసు శాఖల అధికారులతో జాయింట్ కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. అనంతరం జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు-2025 పోస్టర్లను, కరపత్రాలను విడుదల చేశారు.ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి మాట్లాడుతూ జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు చాలా ముఖ్యమైనవన్నారు. ప్రమాదాల వల్ల ఒక ప్రాణాన్ని పోగొట్టుకున్నా తిరిగిరాని పరిస్థితి ఉందని, ఇతరుల పొరపాటు వల్ల ప్రాణాలు కోల్పోవచ్చని, ప్రమాదాలు జరుగకుండా సురక్షిత డ్రైవింగుపై మిగతా 2లో

## సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న విపక్ష నేత బొత్స

### ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన బొత్స, చిన్నశ్రీను, బెల్లాన -నాయకులు, కార్యకర్తలు నడుమ సంక్రాంతి సంబరాలు





మెరకముడిదాం, జనవరి 16, మేజర్‌న్యూస్

సోమలింగాపురం గ్రామంలో సంక్రాంతి సంబరాలు అంబరాన్ని తాకాయి. రాష్ట్ర శాసన మండలి విపక్ష నేత బొత్స. సత్యనారాయణ, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ పార్ల మెంటు సభ్యులు బెల్లాన. చంద్రశేఖర్ రాకతో సోమలింగాపురం మాజీ డిసిఎంఎస్ ఛైర్మన్ (పెదబాబు) గ్రుహంను సర్వాంగ సుందరంగా తయారు చేసారు. ఆ నేతలు నడుమ సంక్రాంతి సంబరాలు కన్నుల పండుగగా, సాంప్రదాయాలను మేలవించే విధంగా జరిగాయి. మాజీ డిసిఎంఎస్ చైర్మన్ శిరువూరి వెంకట రమణరాజు పెదబాబు నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో పెదబాబు ఆహ్వానం మేరకు సోమాలింగాపురం గ్రామంలో సంక్రాంతి సంబరాలులో పాల్గొన్న ముగ్గురు నేతలు ఒకే వేదిక పైకి రావడంతో మండల వైఎస్సార్ పార్టీ నాయుకులు, కార్యకర్తలు ఆనందంతో ఉబ్బి, తబ్బిబ్బు అయ్యారు. నాయకులను, మిగతా 2లో

## పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత

### విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లన్నయ్య



విజయనగరం(కార్పొరేషన్), జనవరి 16, మేజర్‌న్యూస్

పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లన్నయ్య అన్నారు. ఈరోజు క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా 9వ డివిజన్లో ఆయన పర్యటించారు. స్థానిక కార్పొరేటర్ సయ్యద్ గౌస్ షకిల్ తో కలిసి ఆయన మహారాణిపేట, సుంకర వీధి, గౌడ వీధి తదితర ప్రాంతాల్లో పర్యటించి స్థానిక సమస్యలను అడిగి మిగతా 2లో

## అరకులోయకు పోటెత్తిన పర్యాటకులు

అరకులోయ, జనవరి 16, మేజర్‌న్యూస్:

జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రముఖ పర్యాటక కేంద్రంగా ఖ్యాతిగాంచిన అరకు లోయకు పర్యాటకులు గురువారం పోటెత్తారు. దీంతో పర్యాటక సందర్శిత ప్రాంతాలు కిటకిటలాడాయి. మునుపెన్నడూ లేని విధంగా కుటుంబ సమేతంగా తరలిరావడంతో ఇక్కడ సందడి నెలకుంది. సంక్రాంతి పండుగ సెలవుల నేపథ్యంలో పర్యాటకులు అధిక సంఖ్యలో తరలి రావడంతో తాకిడి పెరిగింది.కిరండోలు పాసింజర్ రైలు, ఆర్టీసీ బస్సులు, సొంత వాహనాలపై పర్యాటకులు అరకులోయను సందర్శిస్తుండడంతో పర్యాటక కేంద్రాల్లో విపరీతమైన రద్దీ ఏర్పడింది. అరకులోయకు విచ్చేసే పర్యాటకుల్లో కొందరికి బస చేసేందుకు అద్దె రూపంలో గదులు లభ్యం కావడం కష్టమవుతోంది. దీంతో కొంతమంది పర్యా టకులు చేసేదేమి లేక తప్పనిసరిగా వెనుతి రగాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. వందలాది లాడ్జింగ్ లు, రిసార్ట్స్, వేలాది టెంట్లు ఉన్నప్పటికీ పర్యాటకులు విడిది చేసేందుకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ ప్రాంతంలో బస చేసేం దుకు గదులు,



టెంట్లు దొరకనప్పటికీ పర్యాటకులు చింతించకుండా ఆహ్లాదంగా గడిపి చీకటి పడే లోపు మైదాన ప్రాంతాలకు తరలిపోతున్నారు. ఈ ప్రాంతంలోని కమనీయ దృశ్యాలు పర్యాటకులకు కనువిందు చేస్తుండగా, మంచు సోయగాలు వారిని మైమరిపిస్తున్నాయి. అరకులోయ పరిసర ప్రకృతి అందాలు వారి మనసును దోచేస్తుండడంతో మరిన్ని రోజులు ఇక్కడ పర్యాటకులు బస చేస్తున్నారు. మాడగడ మేఘాలకొండ పొగ మంచు అందాలను వీక్షించేందుకు పర్యాటకులు వేకువ జాము నుంచే క్యూ కడుతున్నారు. ఉదయం 5 గంటల నుంచి 10 గంటల వరకు మేఘాలకొండ ప్రాంతంలోనే సందడి చేస్తున్నారు. వాతావరణంలో పెను మార్పులు చోటు చేసుకోవడంతో పొగ మంచు దట్టంగా కురుస్తోంది. పొగ మంచు ప్రాంతంలో పర్యాటకుల రద్దీ పెరుగుతుంది.ఘాట్ రోడ్ల మలుపులు, యు పాయింట్లు,కాఫీ తోటలు, మిగతా 2లో

## జీరో ఆక్సిడెంట్స్...ఆర్టీసీ లక్ష్యం..!

### ఆర్టీసీలో భద్రతా మాసోత్సవాలు ప్రారంభం -సుశిక్షితులైన డ్రైవర్లు ఆర్టీసీ సొంతం - ప్రతీ డిపోకి ముగ్గురు డ్రైవర్లకు అవార్డులు : రీజనల్ మేనేజర్ అప్పలనాయుడు




విశాఖపట్నం, జనవరి 16, మేజర్‌న్యూస్

ఏపీఎస్ఆర్టీసీలో భద్రతా మాసోత్సవాలను ఏపీఎస్ఆర్టీసీ విశాఖ రీజనల్ మేనేజర్ బి అప్పలనాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా మద్దిలపాలెం, వాల్తేరు డిపో లలో నిర్వహించిన మాసోత్సవాల ప్రారంభ సభల్లో ఆయన మాట్లాడుతూ జనవరి 16 నుంచి ఫిబ్రవరి 15 వరకు ఈ ఉత్సవాలు జరుగుతాయని చెప్పారు. ఏపీఎస ఆర్టీసీ భద్రతకు మారుపేరని, సురక్షిత సుఖవంతమైన ప్రయాణానికి మారుపేరైన విశాఖ ఏపీఎస్ఆర్టీసీని భద్రంగా నడపాలని డ్రైవర్లకు సూచించారు. బస్సులకు ఏ చిన్న చిన్న నిర్వహణ సమస్యలున్నా మెయింటినెన్స్ సిబ్బంది ఎప్పటికప్పుడు సరిచేసి మంచి వెహికల్‌ని డ్రైవర్‌ల కి ఇచ్చి డ్రైవర్లు సురక్షితంగా ఉండేలాగా సురక్షమైన ప్రయాణం చేయించేలాగా తోడ్పడాలని అందరి డ్రైవర్లకు కండక్టర్లకు మెకానిక్లు సిబ్బందికి సూపర్వైజర్లకు అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ నెల రోజుల పాటు ఏదో రూపంలో ఆర్టీసీ కార్యక్రమాలు నిర్వహిస్తుంటుందని అందుకు మిగతా 2లో

## ఒరిస్సా నుంచి అక్రమ కలప రవాణా..?

(మొదటి పేజీ తరువాయి)

ఏవిధంగా తెలియక వారు శాఖ పరంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలుస్తుంది. ఈ విషయమై స్థానిక రేంజర్ రామ్ నరేష్ కు వివరణ కోరగా అక్రమ కలప రవాణా జరిగినట్లు తమ దృష్టికి సమాచారం అందితే దాడి చేసి కేసు నమోదు చేసి వాహనాలను సీజ్ చేస్తామని, అనుమతులు లేకుండా కలప రవాణా చేయడం చట్టరీత్య నేరం అవుతుందని తెలిపారు.

## అరకులోయకు పోటెత్తిన పర్యాటకులు

(మొదటి పేజీ తరువాయి)

జలపాతాలు, గిరిజన సంస్కృతి మ్యూజియం, బొర్రా గుహల వద్ద పోజులిచ్చి ఫోటోలు తీయించుకునే వారి సంఖ్య ఎక్కువగా ఉంటుంది. పర్యాటకుల రద్దీ మహాశివరాత్రి వరకు కొనసాగవచ్చని ఈ ప్రాంతం వ్యాపారులు, మోటార్ యూనియన్ నాయకులు భావిస్తున్నారు. ఏది ఏమైనప్పటికీ పర్యాటకుల తాకిడి పెరగడంతో బొర్రా గుహలు, గిరిజన సంస్కృతి మ్యూజియం, చాపరాయి, కటిక, తాడిగుడ జలపాతాల ఆదాయం గణనీ యంగా పెరుగుతుందని చెప్పవచ్చు. అభివృద్ధి కార్యకలాపాల పేరుతో గత కొద్ది రోజుల నుంచి పద్మాపురం ఉద్యానవన కేంద్రాన్ని మూసివేయడం వల్ల పర్యాటకులు నిరసన వ్యక్తం చేస్తున్నారు.పద్మాపురం గార్డెన్ ను సందర్శించేందుకు అక్కడికి వెళ్లే పర్యాటకులు ముఖ ద్వారం మూసి ఉండడాన్ని తిలకించి పెదవి విరస్తున్నారు.పర్యాటక సీజన్లో అభివృద్ధి పనుల పేరిట పద్మాపురం ముత్యాల వన కేంద్రాన్ని మూసివేయడం అధికారులకు తగదని పర్యాటకులు పేర్కొంటున్నారు.

## విశాఖ ఉక్కుకు రూ.11,300 కోట్ల భారీ ప్యాకేజీ

(మొదటి పేజీ తరువాయి)

కోసం ఈ ప్యాకేజీని వినియోగించనున్నారు. తాజా ఉద్దీపన ప్యాకేజీపై శుక్రవారం అధికారిక ప్రకటన వెలువడనుంది. కేంద్రం పెద్దలను కలిసిన ప్రతిసారి ఏపీ సీఎం చంద్రబాబు విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రస్తావన తెస్తూ, ప్లాంట్ ను గట్టెక్కించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అలాగే కేంద్ర మంత్రుల వద్దకు కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచీ ఏదో రూపంలో స్టీల్‌ప్లాంట్ అంశాన్ని తీసుకెళుతున్నారు. ప్లాంట్ ప్రైవేటీకరణ దాదాపు ఖాయమేనంటూ పుకార్లు షికార్లు చేస్తున్న నేపథ్యంలో ఈ కొత్త ప్రకటన విశాఖతో పాటు ఉత్తరాంధ్ర వాసుల్లో ఆనందం తీసుకొచ్చింది. సంక్రాంతి పండుగ పూర్తయిన మరుసటి రోజే మరో పండగలాంటి వార్తతో విశాఖ వాసులు సంబరాలు చేసుకుంటున్నారు. అనకాపల్లి జిల్లాలో ప్రైవేట్ స్టీల్‌ప్లాంట్‌కు అడుగులు పడుతున్న వేళ విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ సంగతి ఇక అంతేనంటూ పుకార్లు పెద్ద ఎత్తున చెలరేగాయి. ఇటీవల ప్రధాని మోదీ విశాఖ రాగా, ఆ సభలో విశాఖ ప్లాంట్ పై ప్రకటన చేస్తారని అందరూ భావించారు. అయితే, మోదీ సహా చంద్రబాబు, పవన్, లోకేశ్ ఎవరూ ఉక్కు పరిశ్రమపై పల్లెత్తు మాట మాట్లాడకపోవడంతో... ప్రైవేటీకరణ ఖాయమేనన్న వాదనలు బలంగా వినిపించాయి. కానీ కూటమి ప్రభుత్వ నేత చంద్రబాబు ప్రయత్నాలు ఫలించి కేంద్రం సానుకూల నిర్ణయం తీసుకుందని అంటున్నారు. మొత్తానికి ఈ నూతన సంవత్సరంలో ఏపీ ప్రజలకు శుభవార్తను కేంద్రం వినిపించింది.

### ప్యాకేజీపై భిన్న స్వరాలు...!

విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ పునరుద్ధరణకు కేంద్ర ప్రభుత్వం రూ. వేల కోట్ల ఆర్థిక ప్యాకేజీ ప్రకటించనున్నట్టు వస్తున్న సమాచారంపై భిన్న స్వరాలు వినిపిస్తున్నాయి. కేంద్రం నుంచి నేరుగా ప్రకటన రాకపోయినా కూటమి నేతలకు మాత్రం స్పష్టమైన కబురు అయితే అందింది. అయితే దీనిపై కేంద్రం ప్రకటించే వరకూ రాష్ట్ర నేతలు జోక్యం చేసుకోవద్దని వచ్చిన సూచనల నేపథ్యంలో అంతా సంబరాలు చేసుకుంటూనే శుక్రవారం ప్రకటిస్తామని చెబుతున్నారు. అయితే ఈ ప్యాకేజ్ నిధుల రూపంలో కాకుండా, సాంకేతిక సహాయంగా అందించబడుతుందని కొందరి ద్వారా తెలుస్తోంది. ప్రస్తుతం ప్లాంట్‌లో మూడు బ్లాస్ట్ ఫర్నేసులు ఉన్నప్పటికీ, ఆర్థిక ఇబ్బందుల కారణంగా రెండే పనిచేస్తున్నాయి. ఈ పరిస్థితిని మెరుగుపరిచేందుకు, కొత్తగా మూడు ఎలక్ట్రిక్ ఆర్క్ ఫర్నేసులు ఏర్పాటు చేయాలని కేంద్రం యోచిస్తోంది. ఒక్కో ఫర్నేస్ ఏర్పాటుకు సుమారు రూ.2,500 నుండి రూ.3,000 కోట్లు ఖర్చవుతుందని అంచనా. మొత్తం రూ.7,500 కోట్ల వ్యయంతో ఈ ప్రాజెక్టును చేపట్టనున్నారు. ఈ ప్రతిపాదన ప్రకారం, ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచి, అంతర్జాతీయ మార్కెట్లో నాణ్యమైన ఉక్కును ఎగుమతి చేయాలనే లక్ష్యం ఉంది. అయితే, కార్మిక సంఘాలు, స్థానిక ప్రజలు ఈ ప్యాకేజీపై మిశ్రమ స్పందన వ్యక్తం చేస్తున్నారు. ప్లాంట్‌కు ఇది కొత్త ఊపిరి ఇస్తుందనేవారి కంటే, దీని వల్ల ప్రైవేటీకరణకు మార్గం సుగమమవుతుందేమోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నవారూ లేకపోలేదు.

## సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న విపక్ష నేత బొత్స

(మొదటి పేజీ తరువాయి)

కార్యకర్తలను మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ పేరు, పేరున ఆప్యాయంగా పలకరించి వారి యొక్క యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ముగ్గురు నేతలు నడుమ కను విందుగా కనుమ పండుగ జరుపుకోవడం ఎంతో ఆనందదాయకంగా ఉందని కార్యకర్తలు అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపిపి ప్రతినిధి తాడ్డి. వేణు గోపాల్రావు, మాజీ జడ్పీటిసి కోట్ల.వెంకట రావు, జిల్లా వైయస్సార్ పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి బూర్లె నరేష్ కుమార్ పాల్గొన్నారు.

## నేటి నుంచి జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు

(మొదటి పేజీ తరువాయి)

అందరికీ విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. రహదారి భద్రత కార్యక్రమాలు ఎలాంటి నిర్లక్ష్యం వహించకుండా చేపట్టాలన్నారు. జిల్లాలో జనవరి 16వ తేదీ నుంచి ఫిబ్రవరి 15వతేదీ వరకు జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈనెల 17వ తేదీన రహదారి భద్రతపై అవగాహన కల్పించేందుకు స్వచ్ఛంద సంస్థలు, డ్రైవింగ్ స్కూల్ ఇన్స్ట్రక్టర్స్, రిటైర్డ్ ఏపీఎస్ఆర్టీసీ సిబ్బంది తో వాలంటీర్లను గుర్తించి వారికి శిక్షణ ఇవ్వాలన్నారు. ఈనెల 18 నుంచి 21వ తేదీ వరకు మద్యం సేవించి వాహనం నడపే వారిని గుర్తించడం, అధిక వేగంతో నడిపే వాహనాలను స్పీడ్ గన్ తో గుర్తించడం, హెల్మెట్ లేకుండా, సీట్ బెల్ట్ లేకుండా వాహనం నడపడం, సెల్ ఫోన్ డ్రైవింగ్ మొదలైన వాటిపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలన్నారు. ఈనెల 22 నుంచి 23వ తేదీ వరకు జిల్లాలో జాతీయ, రాష్ట్ర రహదారులలో గుర్తించిన బ్లాక్ స్పాట్లలో జాయింట్ ఇన్స్పెక్షన్ చేయడం చేసి అక్కడ తగిన భద్రతా చర్యలు చేపట్టడం చేయాలన్నారు. అనకాపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కూడా బ్లాక్ స్పాట్లలో పరిశీలన చేయాలన్నారు. ఈనెల 24వ తేదీన డ్రైవర్లకు హెల్త్ చెకప్ చేయించడం, 25వ తేదీన అవగాహన కార్యక్రమాలు చేపట్టడం, 26,27వ తేదీలలో ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేసి వాకథాన్ లు నిర్వహించడం, 30, 31వ తేదీలలో బైక్ ర్యాలీలు నిర్వహించడం లాంటి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఇలా వచ్చే నెల 15వ తేదీ వరకు రహదారి భద్రత మాసోత్సవాలలో పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రమాదాలను నివారించేందుకు చర్యలు తీసుకోవాలని, ఇందుకు అధికారులంతా చిత్తశుద్ధితో పని చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా రవాణా శాఖ అధికారి జి. మనోహర్, అనకాపల్లి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్ స్పెక్టర్ ఎం వెంకట నారాయణ, మోటార్ వెహికల్, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్లు, రవాణా, పోలీస్, శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత

(మొదటి పేజీ తరువాయి)

తెలుసుకున్నారు. విచ్చలవిడిగా పశు సంచారం తమ ప్రాంతాల్లో జరుగుతుందని స్థానికులు తెలియజేయడంతో పశువులను క్రమ పద్ధతిలో నిలుపుదల చేసుకోవాలని ఎక్కడబడితే అక్కడ పశు సంచారం గమనించినట్లయితే స్వాధీనం చేసుకుంటామని తెలిపారు. కాలువలు, రహదారులను పరిశీలించారు. రహదారులపై చెత్తాచెదారాలను వేయవద్దని, ప్రభుత్వం అందించిన తడి చెత్త పొడి చెత్త బుట్టలను వినియోగించుకుని చెత్త తరలించే వాహనాలకు అందివ్వాలని చెప్పారు. ప్రజలలో మరింత అవగాహన తీసుకొచ్చి శతశాతం చెత్త వర్గీకరణ సేకరణ చేపట్టేందుకు కృషి చేస్తున్నామని ఈ సందర్భంగా తెలిపారు. స్వచ్ఛ విజయనగరం సాధనలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

## జీరో ఆక్సిడెంట్స్...ఆర్టీసీ లక్ష్యం..!

(మొదటి పేజీ తరువాయి)

ఉద్యోగులంతా సమాయత్తంగా ఉండాలన్నారు. 17 నుండి 21వ తేదీ వరకు మెయిం టినెన్స్ స్పెషల్ డ్రైవ్, అలాగే 22 నుండి 23 వరకు సేఫ్టీ డ్రైవర్, డ్రైవర్స్ డే గా వారికి సురక్షితంగా సూచ నలు ఇస్తామన్నారు. 25 నుండి 28వ తేదీ వరకు డ్రైవర్స్ సేఫ్టీ పై ట్రైనింగ్ ఇచ్చుటకు, 29 నుండి 4 ఫిబ్రవరి వరకూ మెడికల్ పరీక్షలు, సిబ్బంది కుటుం బీకులకు వైద్య పరీక్షలు, అలాగే రక్తదానం కార్యక్రమాలు నిర్వహిస్తామని వెల్లడించారు. ఫిబ్రవరి 13 నుండి 14 వరకు రూట్ సేఫ్టీ మీద ఆడిట్ చేసి ఎలాంటి లోపా లున్నాయో సరిదిద్దుకుంటా 15వ తారీకు బెస్ట్ డ్రైవర్ రీజియన్లో ముగ్గురు, జోన్ లో ముగ్గురు, స్టేట్లో ముగ్గురు, డిపోలో ముగ్గురు చొప్పున వాళ్లకి అవార్డులు ఇచ్చి సత్కరిస్తామని వెల్లడించారు. విశాఖపట్నం జిల్లాలో గతి ఏడాది కంటే యాక్సెడెంట్ రేటు 08 నుండి 0.04 కి తగ్గించడం అయ్యిందని, అలాగే డ్రైవర్లు సూచనలతో జీరో ఆక్సిడెంట్ గా లక్ష్యం చేసుకొని ఎలాంటి ప్రమాదాలు జరుగకుండా తగు చర్యలు తీసుకున్నట్టు వెల్లడించారు. ఈ సమావేశంలో డిపో మేనేజర్ గంగాధర్ విశాఖపట్నం డిపో నుంచి అరుణ్ కుమారి, మద్దిలపాలెం డిపో నుంచి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# రహదారి భద్రత మాసోత్సవాలు



**శ్రీకాకుళం టౌన్, జనవరి 16, మేజర్‌న్యూస్:** ఈ నెల 16 నుంచి ఫిబ్రవరి 15వ తేదీ వరకు నిర్వహించనున్న రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా గురువారం శ్రీకాకుళం-1వ డిపో గ్యారేజ్ ఆవరణలో ప్రారంభోత్సవ సభను నిర్వహిం చారు. ఈ కార్యాక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీకాకుళం పట్టణ ట్రాఫిక్ ఎస్సై శ్రీ.దేవదానం హాజరయ్యారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్సై దేవదానం మాట్లాడుతూ చోదకులు రహదారిపై భారీవాహనాలను నడిపేటప్పుడు ఏకాగ్రత మరియు ఇతర వాహన చోదకుల గమనాలను గమనిస్తూ తద్వారా భద్రతతో కూడిన ప్రయాణ సౌకర్యాన్ని ప్రయాణికులకు కల్పించాలని కోరారు. శ్రీకాకుళం 1వ డిపో మేనేజరు గారు సభికులను ఉద్దేశించి ప్రసంగిస్తూ ప్రమాదరహిత సుఖవంతమైన సురక్షితమైన ప్రయాణాన్ని ప్రయాణికులకు అందించి తద్వారా వారి మన్ననలను పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం-2 డిపో మేనేజర్ శర్మ, శ్రీకాకుళం-1,2 సహాయ మేనేజర్లు రమేష్, గంగరాజు, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ఎల్.ఎస్. నాయుడు, సేఫ్టీ డ్రైవింగ్ ఇన్స్ట్రక్టర్లు భాస్కరరావు, మూర్తి, అసోసియేషన్ ప్రతినిధులు, భద్రత మరియు నిఘా విభాగం వారు, డ్రైవర్లు, మెకానికులు, పి.ఆర్.ఓ. సుమన్ తదితరులు పాల్గొన్నారు.

# టెన్త్, ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతి



రావికమతం జనవరి 16 మేజర్ న్యూస్: మండలంలో గుడ్డిప గ్రామానికి చెందిన టెన్త్, ఇంటర్, లో ఈ ఏడాది అత్యధిక మార్కులు సాధించిన నలుగురు విద్యార్థులకు నగదు బహుమతిని సర్పంచ్ గుమ్మాల గణేశ్వరరావు అందజేశారు. గురువారం గ్రామములో జరిగిన సీతారామ తీర్థ మహోత్సవం సందర్భంగా గ్రామానికి చెందిన వైద్యుడు చింతల శ్రీనివాస్ ఆర్థిక సహాయంతో ఇంటర్లో అత్యధిక మార్కులు సాధించిన దొర్ల నానాజీ(937), 5వేలు రూపాయలు నగదు బహుమతి అందజేశారు. అలాగే ద్వితీయ స్థానంలో నిలిచిన దొర్ల ఉదయ కుమారి (926) సుధాకర్ ఫైనాన్స్ యజమాని మరిసా గోవింద్ ఆర్థిక సహకారంతో 3వేలు రూపాయలు లగదు అందజేశారు. అలాగే పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన చింతల వర్షిణి (581) కి నావి ఉద్యోగి గళ్ళ శ్రీనివాసరావు సమకూర్చిన నాలుగు వేల రూపాయలు లగది బహుమతి అందజేశారు. ద్వితీయ స్థానంలో నిలిచిన తోట వినయ్ కుమార్(576)కు మాజీ సర్పంచ్ గల్లా సత్యారావు ఆర్థిక సాయంతో 2000 రూపాయల నగదు బహుమతిని అందజేశారు.

# కమ్యూనిటీ మరుగుదొడ్లు అవసరం







పార్వతీపురం, జనవరి 16, మేజర్ న్యూస్ : జిల్లాలో సామాజిక మరుగుదొడ్ల నిర్మాణం అవసరం ఉందని జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ అన్నారు. రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి నారాయణ, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ అధికారులు స్వచ్ఛతపై జిల్లా కలెక్టర్లతో గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జిల్లాను స్వచ్ఛత దిశగా తీర్చిదిద్దుటకు వివిధ చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ సలహాదారు శ్రీనివాసన్ సహాయాన్ని కూడా తీసుకోవడం జరిగిందని, వివిధ ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహించామని చెప్పారు. ప్రతి గ్రామంలో వాలంటీర్లను ఏర్పాటు చేసి స్వచ్ఛ కార్యక్రమాలు చేపట్టకు చర్యలు చేపడుతున్నామని ఆయన పేర్కొన్నారు. పార్వతీపురంలో డంపింగ్ యార్డ్ నిర్మాణానికి నిర్దేశిత సంస్థ వచ్చి చేపట్టాల్సి ఉందని, జిల్లాలో సామాజిక మరుగుదొడ్ల నిర్మాణానికి స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ సహకరించాలని ఆయన కోరారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పేదలు పాలిట అమృత వరప్రదానులుగా అన్నా క్యాంటీన్లు

### : రీజనల్ డైరెక్టర్ రవీంద్ర



విజయనగరం కార్పొరేషన్ , మేజర్ న్యూస్ :

పేద ప్రజల పాలిట అమృత వరప్రదాయినులుగా అన్నా క్యాంటీన్లు విరాజిల్లుతున్నాయని రీజినల్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేటర్ రవీంద్ర పేర్కొన్నారు. గురువారం నగరానికి చేరుకున్న ఆయన కమీషనర్ పల్లి నల్లనయ్యతో కలిసి ఘోషాసుపత్రి వద్దనున్న అన్నా కాంటీన్ ను పరిశీలించారు. పారిశుధ్యం భోజన నిర్వహణ వంటి విషయాలను గమనించారు. ప్రజల అభిప్రాయాలను తెలుసుకునే క్యూఆర్ కోడ్ విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. భోజనం%వష% చేస్తున్న ప్రజలను కలిసి అన్నా క్యాంటీన్ల పనితీరు ఎలా ఉందని అడిగారు. దీంతో వారంతా అన్నా క్యాంటీన్లు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం కమిషనర్ పల్లి నల్లనయ్యతో పాటు రీజనల్ డైరెక్టర్ రవీంద్ర కూడా అన్నా క్యాంటీన్ లో పేదలతో కలిసి భోజనం చేశారు. వేడి పదార్థాలు, రుచికరంగా ఉండడంతో సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రీజినల్ డైరెక్టర్ రవీంద్ర మాట్లాడుతూ పేదల ఆకలి బాధలను తీర్చే వర ప్రధాయినిగా అన్నా క్యాంటీన్లు అలరారుతున్నాయని అన్నారు. కేవలం 5 రూపాయలకే రుచి శుచికరమైన ఆహారాన్ని అందిస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న అన్నా క్యాంటీన్లతో పేద వర్గాలకు ఎంతో మేలు చేకూరుతుందన్నారు. దాతలు ముందుకు వచ్చి భూరి విరాళాలను కూడా అందివ్వవచ్చని తెలిపారు. అలాగే శుభ, అశుభ కార్యక్రమాలలో దాతల పేర్లు పైన అల్పాహారం, భోజనం కొరకు విరాళాలు అందివ్వవచ్చునని చెప్పారు.

## ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్ బాబీపై దాడి

### అనుమానషంగా చితక బాదిన సంఘటన -పోలీసులకు పిర్యాదు



**కొత్తూరు, జనవరి 16, మేజర్‌న్యూస్** తనను మెట్టూరు బిట్ గ్రామానికి చెందిన బిళ్ళసొంటి సప్తగిరి, బలగ కాంతారావు, మీసాల షణ్ముఖరావు, ఇరపాడు గ్రామానికి చెందిన పోర్ణ కృష్ణమూర్తి అల్లుడు రాంప్రసాద్ అనే వ్యక్తులు అడ్డగించి చితక బాదినట్లు ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్ రాంప్రసాద్ (బాబీ) పోలీసులకు పిర్యాదు చేశారు. జర్నలిస్ట్ బాబీ ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సబ్ ఇన్స్పెక్టర్ అహమ్మద్ అమీర్ అలీ తెలియ జేశారు. గ్రామంలో పాత తాగాదాలు వలన ఫిర్యాదులో పేర్కొన్న వ్యక్తులు జర్నలిస్ట్ పై దాడి చేశారని ఎస్ ఐ అమీర్ అలీ వెల్లడించారు. నడి రోడ్డుపై సినీ పక్కీలో దాడి చేస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

# స్వామి వారి ఊరేగింపు..



ఆమదాలవలస రూరల్, జనవరి 16, మేజర్ న్యూస్ :ఆమదాలవలస మండలం కొత్తవలస గ్రామంలో కోదండరామ ఆలయం వేంచేసియున్న సీతారామ సహిత ఆంజనేయస్వామి వారిని మకర సంక్రాంతి సందర్భంగా మంగళవారం స్వామివారి ఉత్సవమూర్తులను ఊరేగింపు చేపట్టారు. ధనుర్మాస ఉత్సవాలు ముగింపు కావడం తో పెరుమాళ్లకుప్రత్యేక పూజలు చేపట్టి గ్రామం పురవీధుల్లో ఊరేగింపు చేపట్టడంతో ప్రజలు పూజలు చేపట్టారు.

# ముగిసిన సంఘమేశ్వర స్వామి జాతర

### - వేలల్లో పాల్గొన్న భక్తులు



ఆమదాలవలస, జనవరి 16, మేజర్ న్యూస్ ఆమదాలవలస మండలం గాజుల కొల్లివలస గ్రామం సమీపంలో గల సంగమేశ్వర స్వామి జాతర ఆఖరి రోజు ముక్కనుమతో ముగిసింది. గురువారం జాతర ఆఖరి రోజు కావడంతో జిల్లా నలుమూలల నుండే కాకుండా ఒడిస్సా రాష్ట్రం పర్లాఖిమిడి, విజయనగరం, విశాఖపట్టణం నుండి జాతరకు భారీ ఎత్తున యాత్రికులు తరలి వచ్చారు.చిన్నా పెద్దా తేడా లేకుండా జాతరలో కేరింతలు కొడుతూ ఉత్సాహంగా గడిపారు. జాతరకు యాత్రికులు పోటెట్టడంతో అలికాం బత్తిలి ప్రధాన రహదారి నుండి సంగమేశ్వర స్వామి కొండ దిగువన జరిగే జాతర వద్దకు చేరుకునేందుకు యాత్రికులకు చాలా సమయం పట్టింది. చీకటి పడినప్పటికి జాతరకు యాత్రికుల రాక తగ్గ లేదు. చివరి రోజు కావడంతో భక్తులు కొండ పై నున్న సంఘమేశ్వర స్వామి ని దర్శించుకునేందుకు యాత్రికులు క్యూ లైన్ లలో బారులు తీరారు. జాతర ప్రశాంతంగా ముగియడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. జాతరలో ఎగ్జిబిషన్, ఆట వస్తువులు, ఇతర సామాగ్రిలు ఏర్పాటు చేయడంతో వ్యాపారం లక్షల్లో జరిగినట్లు చర్చించుకుంటున్నారు. జాతరలో ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

## “విశ్వమంథా” ట్రస్టువారి సౌజన్యంతో భజనపోటీలు

లక్కవరపుకోట, జనవరి 16, మేజర్ న్యూస్ : మండలంలోని రేగ గ్రామంలో ముక్కనుమ సందర్భంగా భజన పోటీలు నిర్వహించారు. “విశ్వమంథా” ట్రస్టువారి సౌజన్యంతో భజనపోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేసారు.ఈభజన పోటీలకు వేపాడ, కొత్తవలస, ఎల్. కోట,కోటపాడు మండలాలనుండి ఏడు బృందాలు పాల్గొన్నాయి. ఇందులో బొద్దాం, ఆకుల సీతంపేట, పోతంపేట, పింద్రంగి, చీపురువలస, సుందరయ్యపేట, పెదిరెడ్ల పాలెం గ్రామాల మధ్య తీవ్రమైన పోటీ నెలకొంది. చివరకు బొద్దాం భజనబృందం మొదటి స్థానం కైవసం చేసుకొంది. విజేతలకు ట్రస్టు చైర్మన్ ఎం. అమ్మాజీ చేతులమీదుగా 20 వేలు నగదు ప్రధానం చేసారు.ఈ కార్యక్రమంలో సభ్యులు ఎం.శ్రీనివాసరావు, ఎం.సూర్యం మాస్టారు ,విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## గోమాతకు పూజలు చేస్తున్న మహిళలు



బొబ్బిలిరూరల్, జనవరి 16: మేజర్ న్యూస్: బొబ్బిలి మండలం యం.బూర్జవలస గ్రామంలో సమరసత సేవాఫౌండేషన్ డివిజన్ ధర్మప్రచారక్ ధూపంవాసు మరియు మండలకన్వీనర్ గేదెలజనార్ధనరావు ఆద్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు గురువారం సంక్రాంతి సంబరాలలో భాగంగా కనుమ పండుగను పురస్కరించుకుని గోమాత మరియు భారతమాతకు పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా వాసు మాట్లాడుతూ (గావోఃవిశ్వస్యమాతరం) గోవులో సకలదేవతలు ఇమిడి ఉంటారు. గోవు యొక్క మూపురంలో సూర్యకేతునాడి ఉండుటవలన చక్కటి ప్రాణవాయువు వస్తుందని అన్నారు. ఈకార్యక్రమంలో మరడ స్వామినాయుడు,గొర్లి లక్ష్మణరావు, గుణుపూరు స్వామినాయుడు మరియు మహిళలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

## త్రిబుల్ రైడింగ్ ఢీకొన్న ఘటనలో వ్యక్తి మృతి

కొత్తూరు జనవరి 16(మేజర్ న్యూస్ ) ముగ్గురు యువకులు త్రిబుల్ రైడింగ్ తో ఎదురుగా మొపేడ్‌పై వస్తున్న శిల్లా చక్రవర్తి (65)అనే వ్యక్తి తీవ్ర గాయాలజేమ్స్ ఆసుపత్రి లో చికిత్స పొందుతూ బుధవారంమృతి చెందారు. బుధవారం జరిగిన సంఘటన పైకొత్తూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు. బుధవారం ముగ్గురు యువకులు ద్విచక్ర వాహనం వెళ్తు ఎదురుగా మొపేడ్ వస్తున్నచక్రవర్తిని ఢీ కొనగా తీవ్ర గాయాలు పాలయ్యాడు.స్థానికులు గాయాలు పాలైన చక్రవర్తిని చికిత్స కోసంకొత్తూరు సామాజిక ఆసుపత్రికి తరలించారు.పరిస్థితి విషమించడం తో కుటుంబస్తుల కోరిక మేరకు మెరుగైన వైద్యం కోసం రాగోలు జేమ్స్ ఆసుపత్రి కి తరలించాగా చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందినట్లు మృతుని బంధువులు వెల్లడించారు. యస్ ఐ అమీర్ అలీనిర్వహించిన శవ పంచానామా అనంతరం పోస్ట్ మార్టం జరిపారు. ఈ సంఘటన శ్రీకాకుళం రోడ్ పారాపురం వద్ద జరిగింది.

# ఉపాధి హామీ నిధులు వందశాతం ఖర్చు కావాలి



**విజయనగరం టౌన్ , మేజర్ న్యూస్ :**

గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం రాష్ట్ర ప్రభుత్వం విజయనగరం జిల్లాకు కేటాయించిన 331.32 కోట్ల (మెటీరియల్ నిధులు)ఉపాధిహామీ నిధులు 2025 మార్చి నెలలోగా శత శాతం ఖర్చు అయ్యేటట్లు చూడాలని జిల్లా డ్వామా పీడీ శారదాదేవి ని లోక్ సత్తాపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి కోరారు గురువారం ఆమెను డ్వామా కార్యాలయంలో కలిసిన అనంతరం విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక రాష్ట్రంలో 11 జిల్లాలకు 1995.78 కోట్లు మంజూరు చేసిందని ఇప్పటి వరకు 567.14 కోట్లు మాత్రమే మెటీరియల్ నిధులు ఖర్చు కు సరిపడా ప్రణాళికలు అధికారులు సిద్ధం చేసారని, తిరుపతి, విజయనగరం, ఎన్టీఆర్ జిల్లాలకు రహదారుల పనులకు కేటాయించిన 661.47 కోట్ల రూపాయల్లో 144.32 కోట్లే ఖర్చు చేసారని,విజయనగరం జిల్లాకి కేటాయించిన 331.32 కోట్ల లో 75.23 శాతం మాత్రమే ఖర్చుకు ప్రణాళికలు సిద్ధం చేసారని మిగిలిన 22.71 శాతానికి తగిన ప్రణాళికలు మార్చి 2025 లోగా సిద్ధం చెయ్యకపోతే నిధులు మురిగి పోతాయని,జిల్లా అభివృద్ధి కుంటుపడుతుందని జిల్లాలో చాలా ప్రభుత్వ పాఠశాలకు ప్రహరీ గోడలు లేవని నిధులు ఉన్నాయి కాబట్టి వెంటనే బిల్లులు చెల్లింపులు జరుగుతున్నాయి కాబట్టి గడువులోగా పూర్తి చెయ్యాలని డ్వామా పీడీ దృష్టి కి తీసుకువస్తు వివరాలతో కూడిన వినతిపత్రం అందచేశామని భీశెట్టి తెలిపారు శ్రీకాకుళం, నెల్లూరు, జిల్లా లు ప్రభుత్వం ఇచ్చిన నిధులతో గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు కాల్వలు వెంటనే వేసుకుని నిధులు అద్భుతంగా వాడుకున్నాయని అన్నారు ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రతినిధి తాటప్రాజు రాజారావు,పౌర వేదిక కార్యదర్శి తుమ్మగంటి రామ్మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

# లోవముఠాను ప్రత్యేక గిరిజన మండలంగా గుర్తించాలి

**బి.జె.పి ఎస్.టి మోర్చ జిల్లా అధ్యక్షులు నిమ్మక సింహాచలం**



**జనవరి16,గుమ్మలక్ష్మీపురం(మేజర్ న్యూస్).**

పార్వతీపురం మన్యం జిల్లా, గుమ్మ లక్ష్మిపురం మండల పరిధిలోగల 27 పంచాయితీల్లో, 10 పంచాయతీలు ఉన్న లోవముఠా ప్రాంతాన్నీ ప్రత్యేక మండలంగా గుర్తించాలని బిజెపి ఎస్టి మోర్చ అధ్యక్షులు, నిమ్మక సింహాచలం అభిప్రాయం వ్యక్తం చేశారు.ఆయన గురువారం గుమ్మలక్ష్మీపురం లో విలేకరులతో మాట్లాడుతూ, లోవముఠా పది పంచాయతీల్లో ప్రత్యేకమైన జీవన సంస్కృతి, సాంప్రదాయాలు, గిరిజన కులచారాలు, జీవన సంస్కృతి ఆచారాలు కలిగి ఉండి,అభివృద్ధికి దూరంగా ఉన్నటువంటి లోవ ముఠా ప్రాంతాన్ని ప్రత్యేక గిరిజన మండలంగా గుర్తించి అభివృద్ధి చేయాలని అన్నారు.అదే విదంగా ఈ ప్రాంతంలో జీవ నదులు అయినటువంటి,రేగిడి గడ్డ గాంద్రగడ్డలు కలవన్నారు. అలాగే ఈ ప్రాంతంలో సుమారుగా 90 నుంచి నుంచి 100 గిరిజన గ్రామాలు ఉన్నప్పటికీ,ఒరిస్సాకు ముఖ ద్వారంగా ఉన్న ఈ ప్రాంతమంతా కువి(జాతపు )బాష మాట్లాడే గిరిజన తెగలు, కొండ దొరతెగలు,మరియు పి టి జి(సవర ) భాషలు మాట్లాడే గిరిజనులు నివసిస్తున్నారు. వీరంతా అత్యవసర పరిస్థితుల్లో మండల ఆఫీసులకు వెళ్లాలంటే సుమారుగా 100 కిలోమీటర్లు, మండల కేంద్రానికి వెళ్ళవలసి వస్తుందనీ కావున ఈ ప్రాంతాన్ని ప్రత్యేక గిరిజన మండలంగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సంబంధిత పాలకులు, అధికారులు,ప్రజా ప్రతినిధులు స్పందించే లవముఠా ప్రాంతాన్ని ప్రత్యేక మండలం గా చేయాలని అభిప్రాయం వ్యక్తం చేశారు.ఈ సమావేశం లో లోవముఠా ప్రాంత నిరుద్యోగ యువత తదితరులు పాల్గొన్నారు.

# సందట్లో సడిమియా

**-తెరుచుకోని హౌసింగ్ కార్యాలయం-వెనుదిరిగిన లబ్ధిదారులు**



**నెల్లిమర్ల, జనవరి 16, మేజర్ న్యూస్:**

నెల్లిమర్ల మండల కేంద్రంలోని హౌసింగ్ కార్యాలయం గురువారం తెరుచుకోకపోవడంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడ్డారు. సంక్రాంతి సందర్భంగా వరుసగా ఐదు రోజులు సెలవులు రావడంతో సందట్లో సడిమియా అన్నట్లుగా ఆరో రోజుకూడా కార్యాలయం మూసివేశారు. దీంతో లబ్ధిదారులు తమ సమస్యలు చెప్పు కోవడానికి వచ్చారు. హౌసింగ్ కార్యాలయం తాళాలు వేసి దర్శనం ఇవ్వడంతో వెనుదిరిగారు. ఎప్పటికప్పుడు హౌసింగ్ కార్యాలయం మూతపడుతుందని, ఉన్నతాధికారులు కల్పించుకుని సమస్యను పరిష్కరించాలని లబ్ధిదారులు కోరుతున్నారు. దీనిపై హౌసింగ్ పీడీ శ్రీనివాసరావుని వివరణ కోరగా తనకు సమాచారం లేదని చర్యలు తీసుకుంటామని చెప్పారు.ఫొటో: తాళాలు వేసి ఉన్న హౌసింగ్ కార్యాలయం

# సింహాద్రి అప్పన్న తముడు పెద్దకు కేజీ వెండి వితరణ



**వేపాడ, మేజర్ న్యూస్ :**

వేపాడ మండలంజాకేరు గ్రామమునకు చెందిన తముడు పెద్దుకు అనకాపల్లి వాస్తవ్యులు, బోనాల నాగేశ్వరరావు లలిత దంపతులు జాకీర్ గ్రామంలో గల సింహాద్రి అప్పన్న సేవ గరిడితముడు పెద్దుకు ఒక కేజీ వెండి, ఎద్దు కొమ్ములకు తగిలించే అలుసులు తయారు చేసి వితరణగా ఇవ్వడం జరిగిందన్నారు. ఇటువంటి సేవాభావం కలిగిన కుటుంబానికి భగవంతుడు ఎల్లవేళలా అండగా ఉండాలని గ్రామ సర్పంచ్ బుద్ధ చిన్నమ్మలు గ్రామ పెద్ద అప్పలనాయుడుతో పాటు గ్రామ ప్రజలు బోనాల నాగేశ్వరరావు, కుటుంబం నిండు నూరేళ్లు వర్ధిల్లాలని భగవంతుని కోరారు.

# బుచ్చింపేట గ్రామాల దాహం కేకలు....



**సంక్రాంతి పండుగలో అవస్థలు ఫోటో:**

పార్వతీపురం రూరల్ జనవరి 16 ( మేజర్ న్యూస్): మండలంలోని డోకి సేల గిరిజన గ్రామాల్లో దాహం కేకలు రాజ్యమేలుతున్నా యి. పంచాయతీ పరిధిలో గల అనుబంధ గ్రామాల్లో పూర్తిస్థాయిలో త్రాగునీరు అందక ఆయా గ్రామ గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. సంక్రాంతి పండుగకు కుటుంబ సభ్యులు సమీప చుట్టాలందరూ గ్రామంలోకి వచ్చినప్పటికీ పూర్తిస్థాయిలో మంచినీరు సరఫరా కాకపోవడంతో గ్రామస్తులు రోడ్డు ఎక్కారు. బుచ్చింపేట గ్రామంలోనైతే త్రాగునీరు సరఫరా కి సంబంధించి కొళాయిలు ఏర్పాటు చేశారు తప్ప ఒక్కరోజు కూడా నీరు రావడంలేదని మహిళలు అంటున్నారు. గతంలో వైసిపి పాలన ఉన్నప్పుడు నెలకొకసారి ముచ్చటగా త్రాగునీరు సరఫరా చేసే వారిని నేడు రాష్ట్రంలో కూటమి ఏర్పడ్డాక కనీసం కూడా మీరు రావడం లేదని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు కలుస్త నీరు తాగి రోగాల బారిన పడుతున్నామని ముఖ్యంగా వృద్ధులకు చిన్న పిల్లలకు మోకాళ్ల నొప్పులు వస్తున్నా యని విష జ్వరాల ప్రబలుతున్నాయ, గ్రామానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొళాయి గొట్టలు దిష్టిబొమ్మల మారాయి తప్ప చుక్క నీరు ఇవ్వడం లేదని ప్రజా సంఘాల నాయకులు పి. సంఘం అంటున్నారు. గతంలో కూడా ఈ విషయాన్ని ఆర్డబ్ల్యూఎస్ అధికారుల దృష్టికి తీసుకెళ్లామని, దీనిపై సంబంధిత అధికారులు దృష్టి సారించి సమస్య పరిష్కరించకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరిస్తున్నారు. దీనిపై ఆర్డబ్ల్యూజే బసవరాజు వివరణ కోరగా బుచ్చింపేట విషయం తమ దృష్టిలో ఉందని గతంలో సాంకేతిక లోపం వల్ల గ్రామంలో గల పలు వీధులకు నీరు రావడంలేదని ప్రస్తుతం ఈ సమస్య పరిష్కారానికి శాఖ పరంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

## సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చటంలో

# కూటమి ప్రభుత్వం విఫలం.

**-కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ అడ్డాకుల చిన్నారావు.**



**జనవరి 16, గుమ్మలక్ష్మీపురం (మేజర్ న్యూస్).**

ఎన్నికలకు ముందు తెలుగుదేశం పార్టీ అధినేత ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చటంలో పూర్తిగా విఫలం అయ్యారని కురుపాం కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ అడ్డాకుల చిన్నారావు అసహనం వ్యక్తం చేశారు. గురువారం ఆయన గుమ్మలక్ష్మీపురంలో విలేకరులతో మాట్లాడుతూ, రాష్ట్రంలో సమస్య ఎక్కడుంటే అక్కడికి నేనే వస్తా... ప్రజల చెంతకు ప్రభుత్వ సేవలు అంటూ చంద్రబాబు నాయుడు వర్దిస్తున్న మాటలకు, జాతరకు పొంతనలేదని అన్నారు. ఎన్నికలలో యువతకు 20 లక్షల ఉద్యోగాలు, నెలకు 3 వేల రూపాయల నిరుద్యోగ భృతి, స్కూలుకి వెళ్లే ప్రతి విద్యార్థికి ఏడాదికి 15వేల రూపాయలు, ప్రతి రైతుకు ఏటా 20 వేల రూపాయలు ఆర్థిక సాయం, ప్రతి మహిళకు నెలకు 1500 రూపాయలు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి సూపర్ సిక్స్ పథకాల పేరిట అధికారంలోకి వచ్చిన టిడిపి కూటమి ప్రభుత్వం ఆరు నెలలు పూర్తి అయినప్పటికీ ఇందులో పేర్కొన్న ఏ పథకాన్ని చిత్తశుద్ధితో ప్రజలకు అందజేసిన దాఖలాలు లేవని మండిపడ్డారు. అలాగే సకాలంలో రైతులకు, విద్యార్థులకు అందజేసే రైతు భరోసా (అన్నదాత సుఖీభవ), అమ్మ ఒడి (తల్లికి వందనం), ఆర్థిక సాయం చేసే పుణ్యకాలం దాటిపోయినా నేటికి రూపాయి ఇచ్చిన పాపాన పోలేదని పేర్కొన్నారు.అంతేకాకుండా అందరికీ ఆమోదయోగ్యమైన ఆరు సంక్షేమ పథకాలతో అందలమెక్కిన కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో 100 రోజులలో (మూడు నెలల్లో) ఎన్నికల హామీలన్నింటిని సాకారం చేస్తూ ప్రతి క్షణం ప్రజాహితం అంటూ పాలనలో దూసుకుపోతుంటే, మన రాష్ట్రంలో మాత్రం సీఎం చంద్రబాబు నాయకత్వంలో గల కూటమి ప్రభుత్వం నత్తకు నడకలు నేర్పేలా వ్యవహరిస్తుందని చిన్నారావు ఎద్దేవా చేశారు.

# కోడిపందాల శిబిరంపై దాడి: నలుగురు అరెస్టు

<u>నెల్లిమర్ల, జనవరి 16, మేజర్ న్యూస్:</u>




నెల్లిమర్ల మండలం తంగుడిబిల్లి గ్రామ సమీపంలోని చెరువు వద్ద కోడిపందాల శిబిరంపై గురువారం పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడిలో నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకోవడంతో పాటు మూడు కోడిపుంజులను రూ.1510 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ బి గణేష్ వెల్లడించారు. కోడి పందాలు, పేకాట శిబిరాలపై ప్రత్యేకంగా నిఘా పెట్టినట్లు చెప్పారు. కోడి పందాలు, పేకాట ఆడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# శ్రీషిరిడి సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు

**ఘనంగా శ్రీఅనగాదేవి సహిత జైగురుదత్త హెూమంలు**

**పలు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు**

**గరుగుబిల్లి, జనవరి 16, మేజర్ న్యూస్:**



మండల కేంద్రంలోని శ్రీషిరిడి సాయిబాబా ఆలయంలో గురువారం ప్రత్యేక పూజా కార్య క్రమాలు జరిగాయి. అదేవిధంగా శ్రీఅనగాదేవి సహిత జైగురుదత్త హెూమ%శీ%లు కార్యక్రమమును ఘనం గా నిర్వహించారు. ఈసందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈమేరకు ఉదయం సుప్రభాతసేవ, కాకడ హారతి, తదితరపూజ కార్యక్ర మాలు జరిగాయి. అదేవిధంగా శ్రీషిరిడి సాయిబాబాకు విశేష అర్చనలు అభిషేకములు తదితర పూజా కార్యక్రమాలు నిర్వహిం చారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో వీరఘట్టంకు చెందిన ప్రముఖ యజ్ఞ యాగకర్త, అసంఖ్యాక దేవాలయాల ప్రతిష్టాపకులు ఎస్ వి ఎల్ ఎన్ శర్మయాజి సంపూర్ణ సహాయ సహకారాలతో శ్రీఅనగా దేవి సహిత జైగురుదత్త హెూమ%శీ% లు నిర్వహించారు. ఈహెూమములు చేయించు కోవడంవల్ల ఈతి బాధలు తొలగడంతో పాటు మనసు లో కోరిన కోర్కెలు నెరవేరుతాయని తెలిపారు.ఈహెూమంలు కార్యక్రమం లో పాల్గొన్న దంపతులకు దీక్షవస్త్ర ములను కమిటీ సభ్యులు అందజే శారు. పూజా కార్యక్రమాల్లో ఆయా ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులకు ఉచిత ప్రసాద%శీ% ను అంద జేయడం జరిగిందని తెలిపారు.

# ట్రాఫిక్ నిబంధనలు తెలుసుకోండి..

**ప్రమాదాలు నివారించండి**



**పార్వతీపురం, జనవరి 16, మేజర్ న్యూస్**

: వాహనదార్లు ట్రాఫిక్ నిబంధనలు తెలుసుకుని .. ప్రమాదాలను నివారించడానికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఎ శ్యామ్ ప్రసాద్ అన్నారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా స్థాయి రోడ్డు భద్రతా మాసోత్సవాలు ప్రారంభోత్సవం సందర్భంగా గోడపత్రికలు, కరపత్రాలను విడుదల చేశారు. జాతీయ రహదారుల సంస్థ (నేషనల్ హైవే అథారిటీ), రహదారుల మంత్రిత్వ శాఖ – రహదారులపై సురక్షిత ప్రయాణం (సడక్ సురక్ష అభియాన్) ప్రచారం – 2025లో భాగంగా ఫిబ్రవరి 15వ తేది వరకు జిల్లాలో వివిధ ప్రాంతాల్లో ప్రజలకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలు పై అవగాహన కార్యక్రమాలను కల్పించడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా రోడ్డు భద్రతా ప్రచార సామగ్రి, కరపత్రాలు, బ్రోచర్లుతో అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. రోడ్డు భద్రత అవగాహన కోసం వాలంటీర్లను గుర్తించి శిక్షణ ఇవ్వడం, వాహన డ్రైవర్లకు ఆరోగ్య తనిఖీ, కంటి పరీక్షలు నిర్వహించడం, రోడ్డు భద్రత అమలు, రోడ్డు భద్రత అవగాహన కార్యకలాపాలు నిర్వహించాలని ఆయన సూచించారు. ఎన్ హెచ్, ఎస్ హెచ్ లలో బ్లాక్ స్పాట్‌లను సరిదిద్దడానికి వ్యూహాన్ని సిద్ధం చేయడం, శిక్షణ పొందిన వాలంటీర్లు కళాశాల విద్యార్థులతో వాకథాన్ నిర్వహించడం, వివిధ కార్యక్రమాలు ద్వారా రోడ్డు ప్రమాదాలకు గల వివిధ కారణాల గురించి అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్ ఎస్ శోబిక, జిల్లా రవాణా అధికారి టి.దుర్గాప్రసాద్ రెడ్డి, మోటర్ వెహికల్ ఇన్స్పెక్టర్ ఎం.శశి కుమార్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ జి.సీతారాం, అసిస్టెంట్ మోటర్ వెహికల్ ఇన్స్పెక్టర్లుజి.సత్యనారాయణ, ఎన్.రమేష్ కుమార్, బి.కాశిరాం నాయక్, మెడికల్ ఆఫీసర్ పి.నారాయణరావు, హెూంగార్డులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# చికిత్స పొందుతూ కొండవెలగాడ యువకుడు మృతి



**నెల్లిమర్ల, జనవరి 16, మేజర్ న్యూస్:**

మండలంలోని కొండవెలగాడ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. నెల్లిమర్ల ఎస్ఐ బి గణేష్ అందించిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన తెరపల్లి న ా ర్య నా ర ా య ణ ( 2 6 ) విజయనగరంలోని ఒక బట్టల షాపులో పని చేస్తున్నాడు. సొంత అవసరాల నిమిత్తం గ్రామంలోని కొంతమంది వద్ద నగదు అప్పుగా తీసుకున్నాడు. అలాగే కుటుంబ సమస్యలు కూడా ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఈ నెల 14వ తేదీన సమీప మామిడితోటలోకి వెళ్లి, ఎలుకలను చంపడానికి వినియోగించే మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. పరిస్థితి గమనించిన కుటుంబ సభ్యులు అదే రోజు చికిత్స నిమిత్తం విజయనగరంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. అయితే పరిస్థితి విషమించడంతో 15వ తేదీన మృతి చెందాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

# ఉచిత ఆరోగ్య కేంద్రంకు ఇంటిని కేటాయించడం అభినందనీయం

**ప్రారంభించిన ప్రముఖ కార్డియా లజిస్ట్ డాక్టర్ సూర్యప్రకాష్**

**వైద్యశాలను ఏర్పాటు చేయడం అభినందనీయం... సర్పంచ్ బొంతాడ మహేష్**

**ఆరోగ్య కేంద్రంకు ఇల్లు కేటాయించిన గుంట్రెడ్డి శ్రీరాములునాయుడు**



<u>గరుగుబిల్లి, జనవరి16, మేజర్ న్యూస్:</u>

ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించాలన్న సదుద్దేశము తో ఉచిత వైద్య ఆరోగ్య కేంద్రం నిర్వ హించేందుకు ఇల్లు కేటాయించడం అభినందనీయమని మండల పరిధి లోని రావుపల్లి గ్రామానికి చెందిన ప్రస్తుతం హైదరాబాద్ కేర్ హాస్పిటల్ లో విధులు నిర్వహిస్తున్న ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ గుల్ల సూర్య ప్రకాష్ అన్నారు. మండల పరిధిలోని రావుపల్లి గ్రామంలోని ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించేందుకు ఆరోగ్య కేంద్రం నిమిత్తం గ్రామానికి చెందిన గు%శీ%ట్రేడ్డి శ్రీరాములునాయు డు ఇల్లును కేటాయించారు. వైద్య సేవలు అందించేందుకు ఏర్పాటు చేసిన ఉచిత ఆరోగ్య కేంద్రంను డాక్టర్ సూర్యప్రకాష్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఉచిత వైద్యశాలను ప్రారంభించిన అనంతరం డాక్టర్ సూర్యప్రకాష్ పలువురుకు తనిఖీలు నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో డాక్టర్ సూర్యప్రకాష్ మాట్లాడుతూ ప్రస్తుతం ప్రారంభిం చిన ఉచిత వైద్య కేంద్రంలో తాను ఎప్పటికప్పుడు వచ్చి ప్రజలకు తన వంతు వైద్య సేవలు అందించడం జరుగుతుందని ఈసందర్భంగా పేర్కొన్నారు. గ్రామానికి చెందిన ఇతర ప్రాంతాలలో వైద్య విధులు నిర్వహిస్తున్న వైద్యాధికారులు తమకు వీలున్న సమయంలో వచ్చి ఉచిత వైద్యశాలలో వైద్య సేవలందిం చాలని డాక్టర్ సూర్యప్రకాష్ ఈసంద ర్భంగా గ్రామానికి చెందిన డాక్టర్లను కోరారు. ప్రజలకు మంచి వైద్య సేవలు అందించాలన్న ఉద్దేశంతో ఇంటిని కేటాయించిన గుంట్రెడ్డి శ్రీరాములునాయుడును డాక్టర్ సూర్యప్రకాష్ అభినందించారు. గ్రామ పంచాయతీ సర్పంచ్ బొంతాడ మహేశ్వరరావు (మహేష్) మాట్లా డుతూ రావుపల్లి గ్రామస్తులకు ఖరీదైన ఉచిత వైద్యమును అందిం చేందుకు ఉచిత వైద్యశాల ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. గ్రామస్తులకు మంచి వైద్యం అందిం చాలన్న లక్ష్యంతో ఉచిత వైద్య ఆరోగ్య కేంద్రంను ఏర్పాటు చేయడం పట్ల సర్పంచ్ మహేష్ హర్షం వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో గుంట్రెడ్డి శ్రీరాములునాయుడు, గుంట్రెడ్డి హరి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## గెలుపు ఓటిమిలు సమానంగా తీసుకోవాలి

**రావివలస ఎంపిటిసి సభ్యులు కోట భరత్ కుమార్ (సుమన్)**
**విజేతగా నిలిచిన జట్టుకు బహుమతులు అందజేసిన ఎంపిటిసి సభ్యులు సుమన్**
**క్రికెట్ పోటీల్లో విజేతగా నిలిచిన రావివలస జట్టు**



గరుగుబిల్లి, జనవరి16, మేజర్ న్యూస్:

క్రికెట్ టోర్నమెంట్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు గెలుపు వాటములను సమానంగా తీసుకోవాలని అరుకు పార్లమెంటు తెలుగు యువత ఉపాధ్యక్షులు మరియు, రావివలస ఎంపీటీసీ సభ్యులు కోట భరత్ కుమార్ (సుమన్) అన్నారు. మండల పరిధిలోని రావివలస గ్రామంలో నగిరెడ్డి గంగమ్మ జ్ఞాపకార్థం నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ పోటీల్లో విజేతలుగా నిలిచిన టీములకు బహుమతులను పంపిణీ చేశారు. క్రికెట్ టోర్నమెంట్ పోటీల్లో 24 టీంలు పాల్గొనడం జరిగింది. క్రికెట్ టోర్నమెంట్ పోటీల్లో భాగంగా చివరిగా ఫ్రెండ్స్ యూత్ (ఏ) మరి యు హెల్ రైడర్స్ జట్లు తలపడ్డాయి. మొదటి బ్యాటింగ్ చేసిన ఫ్రెండ్స్ యూత్ ఏ జట్టు 10 ఓవర్లలో 80 పరుగులు చేశారు. నిర్దేశించిన 81 పరుగుల టార్గెట్ తో బ్యాటింగ్ చేసిన హెల్ రైడర్స్ జట్టు మొత్తం 40 పరుగులకే ఆల్ అవుట య్యారు. ఈమేరకు విజేతగా నిలిచి న టీంకు ఎంపిటిసి సభ్యులు భరత్ కుమార్ బహుమతులను అందజేశా రు. టోర్నమెంట్లో మ్యాన్ ఆఫ్ ది సిరీస్ గా బెల్లా న రాంబాబు, బెస్ట్ బ్యాట్స్మన్ గా గుంట్రెడ్డి వినయ్ కుమార్, టోనీ బెస్ట్ బౌలర్ గా కర్రి సంతోష్ ,గుంట్రెడ్డి దినేష్ ,బెస్ట్ వికెట్ కీపర్ గా గుల్ల శ్యామ్ , ఫైనల్ మ్యాచ్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ గా సంభాన రాయుడులు ఎంపికయ్యారు. బెస్ట్ ఫీల్డర్స్ గా జి సంతోష్, మరిశర్ల గౌరీశంకర్ ,నౌడు లోకేష్ లు ఎంపిక య్యారు. ఈకార్యక్రమంలో తోటపల్లి దేవస్థానం మాజీ చైర్మన్ ఆర్నిపల్లి గంగాధరనాయుడు, నీటి సంఘం అధ్యక్షులు గంట సీత%శీ%నాయుడు, ఆర్నిపల్లి శివున్నాయుడు, వెంకట నాయుడు , భానుమూర్తి, సత్యనారా యణ , తదితరులు పాల్గొన్నారు.

## ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు మొదిలి కన్నుమూత



విజయనగరం టౌన్ , మేజర్ న్యూస్ , జనవరి 16:-

జిల్లా ఐఎన్టీయూసీ అధ్యక్షులు, శ్రమ శక్తి రాష్ట్ర అవార్డు గ్రహీత మొదిలి శ్రీనివాసరావు (65) కన్నుమూశారు. గురువారం ఉదయం ఆయన నిద్రలోనే విశాఖలోని తన గృహంలో హృద్రోగంతో మృతి చెందినట్లు కుమారుడు కౌశిక్ గుర్తించారు. వెంటనే శ్రీనివాసరావు భౌతికకాయాన్ని విజయనగరంలోని స్వగృహానికి తరలించారు. పెద్ద ఎత్తున కార్మికులు, అభిమానులు, కాంగ్రెస్ కార్యకర్తలు మొదిలి శ్రీనివాసరావు భౌతిక కాయాన్ని సందర్శించి ఘనంగా నివాళులు అర్పించారు. భార్య కమలావతి, ఇద్దరు కుమార్తెలు ఇందిరా సంయుక్త, నాగదుర్గ నివేదిత, కుమారుడు కౌశిక్ కలిగిన శ్రీనివాసరావు దివంగత మొదిలి సత్యం కుమారుడు, కార్మికనేత దివంగత మొదిలి సూర్యారావు సోదరుడు . తండ్రి, అన్నయ్య అడుగు జాడల్లో నడిచి కార్మిక వర్గానికి శ్రీనివాసరావు అత్యంత ఆప్తుడయ్యారు. అంతేగాక 1983 ఎన్నికలలో విజయనగరం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున ఎమ్మెల్యేగా అశోక్ గజపతిరాజుపై పోటీ చేసిన చరిత్ర మొదిలి శ్రీనివాస రావుది. ఆయన భార్య , చిన్న కుమార్తె ప్రస్తుతం ఆస్ట్రేలియాలో ఉన్నందున వారు వచ్చాక ఆయన అంత్యక్రియలు నిర్వహిస్తారని తెలుస్తోంది. పలు ముఠా కార్మిక సంఘాలకు అధ్యక్షునిగా ఉన్న మొదిలి శ్రీనివాసరావు జిల్లా తెలగా సంక్షేమ సంఘం నిర్మాణంలోనూ, కార్యక్రమాలలోనూ విస్తృతంగా పాల్గొని తన సహాయ సహకారాలు అందించారు. గతంలో ఆంధ్రభూమి దినపత్రికలో పనిచేసిన ఆయన ఐఎన్ టీయూసీ జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డికి ప్రధాన అనుచరునిగా గుర్తింపు పొందారు. మొదిలి శ్రీనివాసరావు మృతికి పాత్రికేయులు, తెలగ సంఘ నాయకులు ఎస్పీరాజు, దిమిలి అచ్యుతరావు తదితరులు తీవ్ర సంతాపం తెలిపారు. కార్మికలోకం ఒక మంచి నాయకున్ని కోల్పోయిందని అన్నారు.

## పదవ తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



గొలుగొండ మేజర్ న్యూ

గొలుగొండ మండలంలోని కొత్త మల్లంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2003 - 2004 విద్యా సంవత్సరానికి సంబంధించిన పదవ తరగతి పూర్వ విద్యార్థులంతా కలిసి కొత్త మల్లంపేట గ్రామంలోని, ఆహ్లాదకరమైన వాతావరణంలో వీరందరూ కలిసి, ఉపాధ్యాయులను ఆహ్వానించి ఘనంగా సత్కరించి ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఎక్కడ ఉన్న దేశంలో కానీ, విదేశాల్లో కానీ విద్యార్థులు అందరూ ఎక్కడ ఉన్నా ప్రతి సంవత్సరం ఇలాగే కలుసుకొని, మీరంతా ఒకే కుటుంబంలా కలుసుకోవడం చాలా ఆనందకరమైన విషయం అని వారు కొనియాడారు. అంతేకాకుండా ఒకరికొకరు సహాయం చేసుకోవాలని పలు సూచనలు తెలియజేశారు. విద్యార్థులందరూ ప్రయోజకులై పదిమందికి ఉపాధి కల్పించే విధంగా ఉండడం మాకు ఎంతో గర్వకారణం అని ఉపాధ్యాయులు ఏక రీతిలో విద్యార్థులను కొనయాడారు. మీరు ఎంత ఎత్తు ఎదిగిన మాకు విద్యార్థులు అని,ఈ అపూర్వ కలయిక వలన మా ఉపాధ్యాయులు అందరిని ఒక 20 సంవత్సరాలు వెనక్కి తీసుకొని వెళ్లారని ఉపాధ్యాయులు ఉద్దేశించి ప్రసంగించారు. అనంతరం విద్యార్థులు మాట్లాడుతూ వారు ఎంత వరకు చదువుకున్నారు, ఏ ఊర్లో స్థిరపడ్డారు వారిలో వారికి తెలియజేసి ఉపాధ్యాయులకు తెలియజేశారు. అదే విధంగా ప్రతి సంవత్సరం ఇటువంటి అపూర్వ కలయిక కార్యక్రమం ఏర్పాటుచేసి కలుసుకుంటామని వాగ్దానాలు చేశారు. ఉదయం నుంచి సాయంకాలం వరకు సాగిన ఈ కార్యక్రమంలో తమ చిన్ననాటి విషయాలు నెమరు వేసుకుంటూ చిన్నపిల్లలు అయిపోయారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు మూర్తి రాజు, నరసింహారావు, రామకృష్ణ, సతీష్, శ్రీనివాస్, సుబ్బారావు, మణిబాబు, రమణ, ఇందిరా దేవి మరియు ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన విద్యార్థినీ విద్యార్థులు ఆర్గనైజర్స్ అయినా గొల్లి అప్పలనాయుడు( నాని), తాతాజీ, శ్రీరామమూర్తి, జి శ్రీను, ఎస్ శ్రీను, ఎస్ అప్పలరాజు తదితర విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఊరిస్తున్న..

# నామినేటెడ్ పదవులు

## రేపో..మాపో మూడవవిడత నామినేటెడ్ పోస్టుల భర్తీ.

## పలాసలో ఆశావాహుల ఎదురు చూపులు.



పలాస జనవరి 16 మేజర్ న్యూస్:

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు కావస్తుంది.కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చేందుకు తెలుగుదేశం పార్టీ,జనసేన పార్టీ, భారతీయ జనతా పార్టీ నేతలు, కార్యకర్తలు ఎంతో కష్టపడి పని చేశారు. వైసిపి ఐదేళ్ల పాలనలో ఎన్నో ఆటుపోట్లను తట్టుకొని,నిర్బంధాలను ఎదుర్కొని పార్టీ కోసం ముఖ్యంగా టిడిపి,జనసేన పార్టీలకు చెందిన క్యాడర్ నిలబడ్డారు.అధికారం వచ్చిన తర్వాత అర్హత కలిగిన నాయకులు నియోజకవర్గంలో ఉన్న వివిధ స్థాయి నేతలు,కార్యకర్తలు తాము ఎన్నికల్లో పనిచేసిన సామర్థ్యం,పనితనం,ప్రతిభ ను గుర్తించి నామినేట్ పదవులు అధిష్టానం ఇస్తుందని ఆశతో ఎదురుచూస్తున్నారు.ఇప్పటికే రెండు జాబితాలు విడుదల చేసిన గాని.. పలాస నియోజకవర్గంలో టిడిపిలో సీనియర్లకు,జనసేనలో క్రియాశీలక నేతలకు ఆశించినంత పదవులు దక్కలేదనే అపవాదు ఉంది.ఈ నేపథ్యంలో కూటమి సర్కార్ లో భాగస్వామ్యం ఉన్న వివిధ రాజకీయ పార్టీలు చెందిన నేతలు,కార్యకర్తలు కొంత అసహనానికి గురవుతున్నారని ఇంటెలిజెన్స్ నివేదికలు అధిష్టానికి అందినట్లు సమాచారం.చాలా కాలం నుంచి మూడో విడత నామినేట్ పదవులు పంపిణీకి అధిష్టానం ఊరించినప్పటికీ సంక్రాంతి పండుగ రావడంతో కాస్త ఈ జాబితా విడుదల లో జాప్యం జరిగినట్లు తెలుస్తుంది. రేపో..మాపో మూడో విడత నామినేటెడ్ పోస్టుల భర్తీ చేయనున్నట్లు జోరుగా ప్రచారం సాగుతుంది.ఇది ఇలా ఉండగా నామినేటెడ్ పదవుల కోసం ఆశావహులు ఎదురుచూస్తున్నారు. ప్రధానంగా రాజకీయ చైతన్యం ఎక్కువగా ఉన్న పలాస నియోజకవర్గం లో ఈ నామినేటెడ్ పోస్టుల కోసం ఆశావాహుల జాబితాలో తెలుగుదేశం పార్టీకి చెందిన సీనియర్ కౌన్సిలర్ దువ్వాడ శ్రీకాంత్,టిడిపి నేతలు లొడగల కామేష్,దువ్వాడ హేంబాబు చౌదరి, మల్లా శ్రీనివాసరావు,టంకాల రవిశంకర్ గుప్తా,గాలి కృష్ణారెడ్డి వంటి నేతలు ఆశావహుల జాబితాలో ఉన్నారు.అయితే వైసీపీలో నుంచి టిడిపిలోకి వచ్చిన పలాస కాశీబుగ్గ పురపాలక సంఘ పూర్వ చైర్మన్ వజ్జ బాబురావు కు అనూహ్యంగా రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ పదవి అధిష్టానం ఇవ్వడంతో కొందరు సీనియర్లు కాస్త అసహనం వ్యక్తం చేస్తున్నారు.తాము పార్టీ ఆవిర్భావం నుంచి జెండా పట్టుకుని పార్టీ కష్టకాలంలో ఉన్న కాలం లో ప్రజల మధ్య ఉంటూ క్యాడర్ ని నిలబెట్టుకుని వచ్చామని..అయినప్పటికీ తమ సేవలు అధిష్టానం గుర్తించలేదన్న ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష విజయంలో స్థానిక మున్సిపాలిటీ కి చెందిన సీనియర్ కౌన్సిలర్ దువ్వాడ శ్రీకాంత్ చాలా శ్రమించారన్న ప్రచారం లేకపోలేదు. ట్రబుల్ షఊటర్ గా పేరుపొందిన దువ్వాడ శ్రీకాంత్ కు పార్టీలోకి ఆహ్వానించేటప్పుడు ఆయన గౌరవానికి తగ్గ నామినేటెడ్ పదవి ఇస్తామని టిడిపి అధిష్టానం భరోసా ఇచ్చినట్లు ఆయన అనుచరులు చెబుతున్నారు.రెండవ జాబితాలో కూడా ఆయనకు ఎటువంటి నామినేట్ పదవి దక్కలేదు.గత వైసిపి ప్రభుత్వం లో దువ్వాడ శ్రీకాంత్ సతీమణికి రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ గా పదవి ఇచ్చారు.గత వైసిపి ప్రభుత్వం లో కూడా మున్సిపల్ చైర్ పర్సన్ పదవి రేసులో ఉన్నప్పటికీ, ఆయనకు ఈ పదవి వెంట్రుక వాసిలో తప్పిపోయింది.ఒక దశలో దువ్వాడ శ్రీకాంత్ కు రెండున్నర సంవత్సరాలు చైర్ పర్సన్ పదవి ఇవ్వడానికి మంతనాలు జరిగినప్పటికీ..నాటి రాజకీయ పరిణామాలు పరిశీలిస్తే.. అనూహ్యంగా బల్ల గిరిబాబుకి మున్సిపల్ చైర్ పర్సన్ పదవి దక్కింది. కనీసం పలాస మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఇస్తారేమో అన్న ఆశతో ఎదురుచూసి నప్పటికీ,తగిన స్థాయిలో గౌరవం దక్కకపోవడంతో..ఆయన మనస్తాపం చెంది టిడిపిలో చేరిపోయారు.రాజకీయాల్లో సీనియర్ నేతగా ప్రాతినిధ్యం వహించడమే కాక ఎన్నికల్లో ప్రత్యర్థులను నిలువరించడంలో మంచి వ్యూహకర్తగా..పోల్ మేనేజ్మెంట్ చేసారన్న ప్రచారం లేకపోలేదు. ఆయనకు రాష్ట్రస్థాయిలో గాని, జిల్లాస్థాయిలో గాని కీలకమైన నామినేట్ పదవి ఇవ్వాలంటూ ఆయన అనుచరులతో పాటు పార్టీలో కూడా సీనియర్లు కోరుకుంటున్నారు. ముఖ్యంగా రానున్న రోజుల్లో నియోజకవర్గాల పునర్విభజన జరిగితే రాష్ట్ర నియోజకవర్గంలో నందిగాం మండలం,మెళియాపుట్టి మండలం విలీనమై నయా పలాస నియోజకవర్గం గా ఏర్పడితే..ఇక్కడ మళ్లీ కళింగ సామాజి వర్గం రాజ్యాధికారం చేపట్టే అవకాశాలు మెండుగా ఉండడంతో.. ముందస్తుగా కళింగ సామాజిక వర్గానికి తగిన ప్రాధాన్యత ఇచ్చేందుకు టిడిపి అధిష్టానం ఆలోచన చేస్తున్నట్టు తెలుస్తుంది.ఇది ఇలా ఉండగా వైసిపి కూడా తమ పార్టీ క్యాడర్ బలోపేతానికి సంస్థా గత పదవులు నియామకంలో కళింగ సామాజి వర్గానికి ప్రాతినిధ్యం ఇవ్వడంతో,కూటమి ప్రభుత్వంలో భాగస్వామ్య పార్టీలు కూడా కళింగ సామాజిక వర్గానికి మరింత చేరువ చేసుకునేందుకు పావులు కదిపేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

## జన్ మాన్ పనులు వేగవంతం చేయాలి



పార్వతీపురం, జనవరి 16, మేజర్ న్యూస్ :

జన్ మాన్ పనులు వేగవంతం చేయాలని ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి అశుతోష్ శ్రీవాస్తవ ఆదేశించారు. గురువారం పార్వతీపురం ఐటీడీఏ కార్యాలయంలో పి. ఎం జన్ మాన్ కార్యక్రమంలో భాగంగా జల్ జీవన్ మిషన్, అంగన్వాడి, ఆవాస్ యోజన, రహదారులు తదితర అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జల్ జీవన్ మిషన్ క్రింద ప్రతి ఇంటికి తాగు నీరు అందించాలని ఆయన అన్నారు. అంగన్వాడి కేంద్రాల్లో పౌష్టిక ఆహారాన్ని అందించాలని, ప్రాథమిక విద్య పట్ల ఆసక్తి కల్పించాలని అన్నారు. గిరిజన గ్రామాల్లో చిన్నారుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆయన చెప్పారు. గిరిజనులు అందరికీ ఇళ్ళు నిర్మించాలని ఆయన పేర్కొన్నారు. మంజూరు అయిన అన్ని ఇళు త్వరగా పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. గిరిజన గ్రామాలకు రహదారులు నిర్మాణంపై దృష్టి సారించాలని ఆయన తెలిపారు. ఈ సమావేశానికి మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు అధికారి విజయ గౌరి, గ్రామీణ నీటి సరఫరా విభాగం ఉప కార్యనిర్వాహక ఇంజినీర్ నాగేశ్వర రావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఉల్లిభద్రలో పూర్వ విద్యార్థుల అపూర్వకలయిక

**గతస్మృతులను నెమరు వేసుకున్న పూర్వ విద్యార్థులు**
**సంక్రాంతి పండుగ సందర్భంగా పూర్వ విద్యార్థులు అపూర్వ కలయిక**



గరుగుబిల్లి, జనవరి16, మేజర్ న్యూస్:

మండల పరిధిలోని ఉల్లిభద్ర గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2005-2006 సంవత్సరం మధ్యలో పదవతరగతి చదువు కున్న "పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక" కార్యక్రమంను గురువారం ఘనంగా నిర్వ హించారు. ఈసంద ర్భంగా పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థుల అపూర్వకలయిక నిర్వహించిన సందర్భంగా చదువు కున్న రోజులలో తమ పాత జ్ఞాపకాల ను గుర్తుచేసుకున్నారు.అదేవిధంగా విద్యార్థులు ఒకరి నొకరు కలుసు కుని వారి వారి కుటుంబ పరిస్థితులు మరియు ,యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో విద్య నభ్య సించిన రోజులలో గత స్మృతులను నెమరు వేసుకున్నారు. పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక సందర్భముగా పాఠశాలలో చదువు కున్న విద్యార్థులందరము ఒకే చోట కలవడం తమకెంతో ఆనందంగా ఉందని ముడిలి శంకర్రావు, నక్కెర్ల భాస్కరరావు, నక్కెర్ల శివప్రసాద్ , నారాయణపురం మహేష్ ,పొడుగు ఊర్మిళ ,సతి పిడకల రమేష్, చిట్టి సరస్వతి, బొత్స శాంతి, శెట్టి లక్ష్మి, శెట్టి భారతి, పూడి రాజేశ్వరి, బోనెల మరియమ్మ, ఈసందర్భంగా పేర్కొ న్నారు.

## మహిళలకు ముగ్గుల పోటీలు.

**సంస్కృతి సంప్రదాయాలను పాటించండి.**




కే కోటపాడు జనవరి 16( మేజర్ న్యూస్)

సంక్రాంతి పర్వదినమున ప్రతి మహిళా తమ ఇంటి ముందు రంగురంగుల ముగ్గులు వేసి సంక్రాంతి పండక్కు స్వాగతం పలకాలని స్థానిక మాజీ సర్పంచ్ మరియు టీడీపీ సీనియర్ నాయకులు డోకల లక్ష్మీనరసింహ మూర్తి అన్నారు. సంక్రాంతి సందర్భంగా కె. కోటపాడు గ్రామంలో ఇంటింటికి ముగ్గులు పోటీలను నిర్వహించారు. ఇందులో ప్రతి ఒక్కరూ ఇంటిముందు రంగురంగుల హరివిల్లు ముగ్గులు వేసి మహిళలు ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ ముగ్గుల పోటీలను పైల గోపి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించి మహిళలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మహిళ ఇంటి ముందు ముగ్గులు వేసి మన సంస్కృతి సంప్రదాయాలను పాటించాలని అన్నారు. ఈ ముగ్గులు పోటీల్లో గెలుపొందిన మహిళలకు బుధవారం బహుమతులను అందజేశారు. బహుమతులు అందుకున్న మహిళలు ఆనందాన్ని వ్యక్తం చేశారు . ప్రతి సంవత్సరం ఇలాగే ముగ్గులు పోటీలు నిర్వహిస్తే మహిళలు ఇంకా ఉత్సాహంగా తమ ఇంటి ముందు ముగ్గులను వేసి సంక్రాంతికి స్వాగతం పలుకుతారని ఈ సందర్భంగా మహిళలు తెలియజేశారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీలకు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించిన జర్నలిస్టులు వేగి రామారావు, నంబరు అప్పారావు లను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ యర్రం శెట్టి భవాని గురయ్యా, బండారు బండారు నారాయణ పాత్రుడు, సీనియర్ పాత్రికేయులు వై .ధర్మారావు, వేగి రామారావు, నంబారు అప్పారావు, నీలి శ్రీను, పైలా గంగు నాయుడు, రొంగలి చిరంజీవి, పట్నాల రామచంద్రరావు, మహిళలు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో దండు ముత్యాలమ్మ తల్లి తీర్థం.

కే కోటపాడు జనవరి 16, (మేజర్ న్యూస్)



తీర్థాలలో ప్రజలు ఐకమత్యంతో కలసి మెలసి జీవించాలని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి కోరారు. మండలంలోని గొండు పాలెం గ్రామంలో గురువారం జరిగిన దండు ముత్యాలమ్మ తల్లి అమ్మవారిని తెలుగుదేశం పార్టీ నాయకులతో కలసి దర్శించుకున్నారు. గుడికి సమీపంలో జరిగిన గుర్రం పందాల పోటీలకు రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ పి వి జి కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు నగదు బహుమతులను అందజేశారు. గ్రామంలో రెండుచోట్ల సాంస్కృతి కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కోడిపందాల శిబిరంపై దాడి.. ఎనిమిది మంది అరెస్ట్..

చీపురుపల్లి జనవరి 16 మేజర్ న్యూస్ :



మండలంలోని మెట్టపల్లిలో నిర్వహిస్తున్న కోడిపందాల శిభిరంపై పోలీసు దాడి చేసి ఎనిమిది మందిని అరెస్టు చేశారు. ఎస్సై ఎల్ దామోదర్ రావు అందించిన సమాచారం మేరకు మెట్టపల్లిలో జరుగుతున్న కోడిపందాలు శిబిరం పై దాడి నిర్వహించి పందాలు నిర్వహిస్తున్న ఎనిమిది మంది నుంచి రూ.15,280 నగదు, ఎనిమిది సెల్ ఫోన్లు, ఆరు పందెం కోళ్ళు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

# మహిళలకు ముగ్గుల పోటీలు



మునగపాక మేజర్ న్యూస్ జనవరి 15

మండల కేంద్రమైన మునగపాక తులసి కళ్యాణ మండపం నందు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి, మాజీ వార్డ్ మెంబర్, జననేత ఆడారి కాశి బాబు ఆధ్వర్యంలో మహిళలకు సంక్రాంతి సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు, గెలుపొందిన విజేతలకు రాష్ట్ర వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి, ఆర్ఇసిఎస్ మాజీ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ చేతుల మీదుగా ప్రథమ బహుమతి పొలిమేర అచ్యుత కు పెద్ద గ్రైండర్, రెండో బహుమతి ఆడారి పావని గ్యాస్ స్టవ్, మూడో బహుమతి మిక్సీ, నాలుగు, 5, బహుమతులు, మరియు కన్సిలేషన్ బహుమతులు, పోటీలో పాల్గొన్న ప్రతి మహిళకు సుమారు 200 రూపాయలు విలువచేసే గిఫ్టును అందజేశారు, ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ప్రతియాట క్రమం తప్పకుండా మహిళా రైతులను, మహిళలను ప్రోత్సహించాలని ఉద్దేశంతో ఈ ముగ్గులు పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు, ఈ కార్యక్రమంలో సర్పంచ్ దిమ్మల అప్పారావు, సూరిశెట్టి కన్నారావు, కాండ్రేగుల జగ్గారావు, దొడ్డి అప్పలనాయుడు, వెలగా రామకృష్ణ, వేగి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు

# నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం.

అనకాపల్లి, జనవరి 16, మేజర్ న్యూస్:

కొత్తూరు సెక్షన్ కార్యాలయం పరిధిలో కొంతమేర శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ కశింకోట డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్. రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 132/33 కేవీ కసింకోట సబ్స్టేషన్ మరమ్మతుల కారణంగా కొత్తూరు సెక్షన్ కార్యాలయం పరిధిలో గల 33/11 కేవీ కొత్తూరు సబ్స్టేషన్స్ పరిధిలోని కొత్తూరు , మూలపేట, సత్యనారాయణపురం, సంపతిపురం, వేట జంగాల పాలెం, కూండ్రం, కుంచంగి, రొంగలివానిపాలెం, పిసినికాడ గ్రామాలకు శుక్రవారం ఉదయం 9 నుండి సాయంత్రం 4 గంటల వరకు గృహ అవసరాల విద్యుత్, వ్యవసాయ విద్యుత్ సరాఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు అందరూ సహరించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

# అతని నేత్రాలు సజీవం

%చీపురుపల్లి జనవరి 16 మేజర్ న్యూస్ :



మండలంలోని పెద్దనడిపల్లి గ్రామానికి చెందిన రిటైర్డ్ టీచర్ మన్నె పెద్ద సత్యనారాయణ (74) అనారోగ్యం కారణంగా మృతి చెందారు. గతంలో ఆయన తన గ్రామం మొత్తం నేత్ర, అవయవాదానం చేయించుటలో స్ఫూర్తిప్రదాత, మొదటి నేత్ర అవయవ దానంకు అంగీకారం తెలిపిన మొదటి వ్యక్తి. అతని నేత్రాలు దానం చేయించాలి అనుకున్న కుటుంబ సభ్యులు నిర్ణయించుకుని మానవీయత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు, నేత్ర అవయవదాన ఉద్యమకర్త బి వి గోవిందరాజులుకు తెలియజేయగా శ్రీకాకుళం రెడ్ క్రాస్ చైర్మన్ జగన్మోహన రావుకి చెప్పడంతో మగటపల్లి కళ్యాణ్ నేత్ర సేకరణ కేంద్రం ఐ టెక్నీషియన్ పి సుజాత, సహాయకులు ఉమాశంకర్ ద్వారా అతని కార్నియాలు సేకరించి విశాఖపట్నంలోని ఎల్.వి.ప్రసాద్ నేత్ర సేకరణ కేంద్రానికిఅందజేశారు. వారి మృతికి సంతాపం తెలియ జేస్తూ దాత కుటుంబ సభ్యులను గోవిందరాజులు, ఛైర్మన్ జగన్మోహనరావు ఇతర సభ్యులు అభినందించారు. ప్రస్తుత కాలంలో నేత్ర అవయవ దానంపై అవగాహన, చైతన్యం ప్రజల్లో బాగా పెరుగుతుందని, ఈ విధంగా నేత్రదానం ద్వారా మరొకరికి ఈ ప్రపంచాన్ని చూసే అవకాశం కలుగుతుందని, అంధత్వ రహిత సమాజ స్థాపనకు యువత,ప్రజలు కృషి చెయ్యాలని కోరారు.

## ఘనంగా శ్రీ ముత్యమాంబ అమ్మవారి

# తీర్థ మహోత్సవం

## కోదండరాముడును

## దర్శించుకున్న ఎమ్మెల్యే సుందరపు



మునగపాక మేజర్ న్యూస్ జనవరి 15

మండలం.లో రామగిరి గ్రామపంచాయతీ లో . శ్రీ కోదండ రామస్వామి తీర్థ మహోత్సవానికి శాసనసభ్యులు. సుందరపు విజయ్ కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు..ఆంజనేయ స్వామిని. రాములవారిని దర్శించుకుని. భక్తులను ఉద్దేశించి. ఎమ్మెల్యే విజయ్ కుమార్ మాట్లాడుతూ. కోదండ రామస్వామి తీర్థ మహోత్సవం విచ్చేసిన భక్తులందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో. మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు. దొడ్డి శ్రీనివాసరావు. రామగిరి సర్పంచ్ పోతిన పర్వతమ్మ. క్లస్టర్ ఇంచార్జ్ కొరపాటి వీర రాజశేఖర్. మండల తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి పోతిన నాగ శివ ఎల్లపు శ్రావణ్ కుమార్. కాయల శ్రీను. లెగిసెట్టి సన్యాసిరావు. ఎల్లేటి మాధవ్. తదితరులు పాల్గొన్నారు.

# విజేతలకు బహుమతులందజేత



మునగపాక మేజర్ న్యూస్ జనవరి 15

మండలంలో తిమ్మరాజుపేట గ్రామంలో గురువారం శ్రీ ముత్యమాంబ అమ్మవారి తీర్థ మహోత్సవం ఘనంగా నిర్వహించారు, ఈ సందర్భంగా మహిళలకు, ముగ్గుల పోటీలు, మ్యూజికల్ చైర్ పోటీలు, కోలాటములు, తప్పటి గుళ్ళు, తాడు పెద్ద సేవ ఘనంగా నిర్వహించారు, పోటీలలో గెలుపొందిన విజేతలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ భీమర శెట్టి శ్రీనివాసరావు, సర్పంచ్ భీమిశెట్టి మంగ లక్ష్మి కృష్ణారావు, అనకాపల్లి జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు ఆడారి మంజు నాగేశ్వరరావు చేతుల మీదగా బహుమతి ప్రధానం చేశారు, అనంతరం భీమర శెట్టి శ్రీనివాసరావును ఘనంగా సత్కరించారు, ఈ కార్యక్రమంలో భీమిశెట్టి ఉమా శంకర్ మాస్టారు, ఆడారి రేణుక ప్రసాద్, కెవి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు



# క్రీడాకారులకు బోస్ 50 వేల రూపాయలు ప్రోత్సాహం

అనందపురం జనవరి 15 మేజర్ న్యూస్

ఘట్టమనేని సుభాష్ చంద్ర ఆనందపురం మండలంలోని ముచ్చర్ల గ్రామంలో సంక్రాంతి పండగ సందర్భంగా నిర్వహించిన క్రికెట్ క్రీడా పోటీలలో సుమారు 50 వేలు రూపాయలతో యువతకు క్రీడా దుస్తులు మెమొంటోళ్లు అందజేసి క్రీడా కారులకు ప్రోత్సించారు. ఈ సందర్భంగా బోస్ మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా క్రీడా రంగాల్లో రాణించాలన్నారు క్రీడలతో పాటు సమాజ అభివృద్ధిలో తమ వంతు పాటుపడాలన్నారు ఈ సందర్భంగా గెలుపొందిన టీంకు ఆయన చేతుల మీదుగా బహుమతులు అందజేశారు కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లంక అప్పలనారాయణ గిడిజాల మాజీ సర్పంచ్ కోరాడ రాము, శినగం శివ, చిన్నయ్య అప్పలరమణ, శివాజీ పాల్గొన్నారు

# నైతిక విలువలు చంద్రబాబు సొంతం

## సుప్రీం తీర్పుపై స్పందించిన టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు

భీమునిపట్నం, జనవరి 16, మేజర్ న్యూస్ :



రాజ్యాంగ బద్ధంగా, నైతిక విలువలతో కూడిన రాజకీయాలు చేస్తూ, రాబోయే తరానికి ఆదర్శంగా ఉండటమే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నైజమని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు అన్నారు. నారా చంద్రబాబు నాయుడుపై వై.సి.పి ప్రభుత్వం అక్రమంగా పెట్టిన స్కిల్ కేసు బెయిల్ పిటీషన్ కి సంబంధించి సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ఆ పార్టీ నాయకులకు చెంపపెట్టని అన్నారు. నీతిమాలిన రాజకీయాలు చేస్తూ అడ్డూ అదుపు లేని కేసుల్లో ప్రధమ ముద్దయిగా ఉన్న పులివెందుల ఎమ్మెల్యే జగన్ రెడ్డికి ఇది ఒక గుణపాఠం అని అన్నారు. చంద్రబాబు బెయిల్ రద్దయితే కూటమి ప్రభుత్వం విచ్ఛిన్నం అవుతుందని మరలా ఎన్నికలు వస్తే వైసిపీ గెలుస్తుందని కాకమ్మ కబుర్లు చెప్పిన మీకు, మీ సలహా దారులకు సుప్రీం తీర్పు ఇచ్చిన ఒక హెచ్చరిక అని అన్నారు. అక్రమ కేసుకే బెయిల్ రద్దయితే 11 చార్జ్‌షీట్లు ఉండి 33 కేసుల్లో ప్రధమ ముద్దయిగా ఉన్న మీ బెయిల్ రద్దయితే ఎలా ఉంటుందో ఆలోచించుకోవాలని జగన్ రెడ్డికి హెచ్చరించారు. సంబంధం లేని కేసులకు సంబంధించి కూడా కోర్టులో పిటీషన్లు వేయొచ్చని మీదగ్గర, మీ అనుచర సలహా దారుల దగ్గరే నేర్చుకోవాలని అన్నారు. చంద్రబాబు కడిగిన ముత్యమని అన్నారు. నీలాంటి జగన్ లు వందమంది వచ్చినా చంద్రబాబును ఏమి చేయలేరని అన్నారు. నేటి తరానికి దేవుడిచ్చిన బహుమానం చంద్రబాబు అని అన్నారు. మీ పనికిమాలిన రాజకీయాలకు విసుగెత్తి రాష్ట్ర ప్రజలు 11 సీట్లే ఇచ్చినా సిగ్గులేకుండా ఉన్నారని అన్నారు. తొందరపడకు జగన్ రెడ్డి మీ అనుచరగణం గత ఐదేళ్లలో చేసిన అక్రమాలు, నిర్వాకాలు అన్నీ బయటకు వస్తాయని అప్పుడు తెలుస్తుంది ఎవరు ఏంటని గంటా నూకరాజు హెచ్చరించారు.

# సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న విపక్ష నేత బొత్స.!

## ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన బొత్స , చిన్నశ్రీను, బెల్లాన.!

## నాయకులు,కార్యకర్తలు నడుమ సంక్రాంతి సంబరాలు .!



మెరకముడిదాం జనవరి 16 మేజర్ న్యూస్.

సోమలింగాపురం గ్రామం లో సంక్రాంతి సంబరాలు అంబరాన్ని తాకాయి. రాష్ట్ర శాసన మండలి విపక్ష నేత బొత్స. సత్యనారాయణ, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి.శ్రీనివాసరావు, మాజీ పార్ల మెంటు సభ్యులు బెల్లాన. చంద్రశేఖర్ రాకతో సోమలింగాపురం మాజీ డిసియంయస్ ఛైర్మన్ (పెద బాబు) గ్రుహంను సర్వాంగ సుందరంగా తయారు చేసారు. ఆ నేతలు నడుమ సంక్రాంతి సంబరాలు కన్నుల పండుగగా, సాంప్రదాయాలను మేలవించే విధంగా జరిగాయి. మాజీ డిసియంయస్ ఛైర్మన్ శిరువూరి. వెంకట రమణ రాజు పెదబాబు నిర్వహించిన ఆత్మీయ సమావేశం లో పెదబాబు ఆహ్వానం మేరకు సోమాలింగాపురం గ్రామం లో సంక్రాంతి సంబరాలులో పాల్గొన్న ముగ్గురు నేతలు ఒకే వేదిక పైకి రావడంతో మండల వైయస్సార్ పార్టీ నాయుకులు, కార్యకర్తలు ఆనందం తో ఉబ్బి , తబ్బిబ్బు అయ్యారు. నాయకులను, కార్యకర్తలను మాజీ మంత్రి బొత్స. సత్య నారాయణ పేరు, పేరున ఆప్యాయంగా పలకరించి వారియొక్క యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ముగ్గురు నేతలు నడుమ కను విందుగా కనుమ పండుగ జరుపుకోవడం ఎంతో ఆనందదాయకంగా ఉందని కార్యకర్తలు అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపిపి ప్రతినిధి తాడ్డి. వేణు గోపాల్రావు, మాజీ జడ్పీటిసి కోట్ల.వెంకట రావు, జిల్లా వైయస్సార్ పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి బూర్లె.నరేష్ కుమార్ పాల్గోన్నారు.

# ఘనంగా సంక్రాంతి పండగ



డుంబ్రిగుడ, జనవరి,16 మేజర్ న్యూస్:-

సంక్రాంతి పండగ ఉత్సవాలను మండలంలోని గిరిజన గ్రామాల్లో గిరిజనులు ఘనంగా నిర్వహించుకుంటున్నారు. ఈ సందర్భంగా గిరిజన సంప్రదాయమైన దింసా నృత్యాలను ప్రదర్శిస్తూ గిరిజనులు ఆనందంగా జరుపుకుంటున్నారు. షేర్ బుడియా,సొబోరి నృత్యాలను ప్రదర్శిస్తూ ఇంటింటికి చందాలను వసూలు చేస్తూ గిరిజనలు ఘనంగా జరుపుకున్నారు. స్థానిక మండల కేంద్రంలో అల్లూరి యూత్ ఆధ్వర్యంలో గత మూడు రోజుల నుంచి దింస నృత్యాలు, ఆటపాటలతో ఘనంగా నిర్వహిస్తున్నారు.

## సజావుగా కొనసాగుతున్న

# కానిస్టేబులు ఉద్యోగాల నియామక ప్రక్రియ

## విజయనగరం జిల్లా ఎస్పీ వకుల్ జిందల్,



విజయనగరం క్రైం , మేజర్ న్యూస్ :

స్టైఫెండరీ పోలీసు కానిస్టేబులు ఉద్యోగ నియామకాలకు ప్రాథమిక రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు పి.ఎం.టి. , పి.ఈ.టి. పరీక్షల ప్రక్రియ కొనసాగుతున్నట్లుగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ గురువారం తెలిపారు. జనవరి 16న నిర్వహించిన 11వ రోజు పి.ఎం.టి. , పి.ఈ.టి. పరీక్షలకు 600 మంది పురుష అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా, 415 అభ్యర్థులు మాత్రమే పి.ఎం.టి./పి.ఈ.టి. పరీక్షలకు హాజరయ్యారని, వారిలో 314మంది అభ్యర్థులు తుది రాత పరీక్షకు అర్హత సాధించారన్నారు. నియామకాల ప్రక్రియ వేకువ జామున 5గంటల నుండే ప్రారంభం కావడం, ప్రణాళికాబద్ధంగా వ్యవహరించడంతో, పి.ఎం.టి. మరియు పి.ఈ.టి. పరీక్షలు సకాలంలో పూర్తయ్యా యన్నారు. పోలీసు నియామకాల ప్రక్రియను జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, ఎఆర్ అదనపు ఎస్పీ జి.నాగేశ్వరరావు స్వయంగా పర్యవేక్షించారు. అభ్యర్థులకు ముందుగా హాల్ టిక్కెట్స్ పరిశీలించి, పోలీసు పరేడ్ గ్రౌండులోకి అనుమతించారు. అనంతరం, అభ్యర్థుల విద్యార్హతలు, రిజర్వేషన్లు, వయస్సు నిర్ధారించే ధృవపత్రాలను పరిశీలించి, అన్ని సర్టిఫికేట్స్ సక్రమంగా ఉన్న అభ్యర్థులకు మాత్రమే బయోమెట్రిక్ తీసుకొని, పి.ఎం.టి. పరీక్షలకు అనుమతించామన్నారు. ఆధునిక సాంకేతిక నైపుణ్యం కలిగిన డిజిటల్ ఇక్విప్మెంట్స్ వినియోగించి, అభ్యర్థుల ఎత్తు, ఛాతీ కొలతలను నిర్ధారించి, అర్హత సాధించిన అభ్యర్థులకు పి.ఈ.టి. పరీక్షలను అనుమతించామని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. ఈ నియామక ప్రక్రియలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, ఎఆర్ అదనపు ఎస్పీ జి.నాగేశ్వరరావు, డిఎస్పీలు ఎం.వీరకుమార్, యూనివర్స్, ఎస్.రాఘువులు, టి.ఎన్.శ్రీనివాసరావు, కే.థామస్ రెడ్డి, ఎఓ పి.శ్రీనివాసరావు, పలువురు సిఐలు, రిజర్వు ఇన్స్పెక్టర్లు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, పిఈటీలు , ఇతర పోలీసు అధికారులు, పోలీసు కార్యాలయ ఉద్యోగులు పాల్గొని ఎంపిక ప్రక్రియ సజావుగా జరిగే విధంగా విధులు నిర్వహించారు.

# అనుమానాస్పదస్థితిలో వృద్ధురాలు మృతి

రామభద్రపురం, మేజర్ న్యూస్ :



విజయనగరం జిల్లా రామభద్రపురం మండలంలోని కొట్టక్కి గ్రామంలో దండు సింహాచలం(75) అనే వృద్ధురాలు అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. డబ్బులు కోసమే దుండగులు హత్య చేసి ఉంటారని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇటీవల గ్రామంలో దొంగలు హల్చల్ చేస్తున్నారు. వివిధ షాపుల్లో చోరీలు జరిగాయి. ఈ క్రమంలో అదే తరహాలో వంటరిగా ఉంటున్న వృద్ధురాలి ఇంటికి దొంగతనానికి వెళ్లి హతమార్చి ఉంటారని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఆమెను ఉరివేసి ఆత్మహత్యగా చిత్రీకరరించారని స్థానికులు తెలుపుతున్నారు. పండగకి రాలేదు అని చూసేందుకు దూరపు బంధువు రావడంతో దారుణం వెలుగు చూసింది. పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని దర్యాప్తు ముమ్మరం చేస్తున్నారు. క్లూస్, డాగ్ స్క్వాడ్ చేరుకొని దర్యాప్తు చేస్తున్నారు

# కవ్వగుంటలో ముగిసిన సంక్రాంతి సంబరాలు

రావికమతం జనవరి 16 మేజర్ న్యూస్ :



మండలంలో కవ్వగుంట పంచాయతీలో గురువారంతో సంక్రాంతి సంబరాలు ముగిసేయి భోగి సంక్రాంతి కనుమ మూడు రోజులపాటు గ్రామంలో గ్రామపంచాయతీ సర్పంచ్, రాజన్న యువత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ముగ్గులు పోటీలు,లెమన్ స్పూన్, మ్యూజికల్ చైర్, డాన్స్, పాటలు నిర్వహించారు. విజేతలను ఉపాధ్యాయులు వేపాడ సత్యనారాయణ గెంజి నాగేశ్వరరావు తదితరులు ఎంపిక చేశారు. వీరికి సర్పంచ్ దాసరి సూర్య కుమారి బహుమతులు ప్రధానం చేశారు మూడు రోజులపాటు హరి భజన, చిటికెల భజన,కోలాటం తదితర సాంస్కృతి కార్యక్రమాలు అట్ట ఆసంగా జరిగాయి.